www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 9014966169

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 198 | మంగళవారం | 14 జులై, 2026

ప్రాజెక్టులను పట్టాలెక్కిద్దాం

రాష్ట్రం కోసం ఒక్కటిగా పోరాడుదాం

- రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం, ఎంపీలు కలిసి పనిచేద్దాం
- పెండింగ్ అనుమతులపై కేంద్రం నుంచి అనుమతులు సాధించండి
- ఐఐఎం, మెట్రో ఫేజ్–2, ఆర్ఆర్ఆర్, మూసీ పనులపై కేంద్రంతో సంప్రదింపులు జరపాలి
- ఎంపీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- కేంద్ర అనుమతులు, నిధుల సాధనకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచన

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధి లక్ష్యాల సాధనకు రాష్ట్ర ఎంపీలు కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం, పార్లమెంట్ సభ్యులు కలిసి పనిచేస్తేనే పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు సాధించగలమని పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఎంపీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న పలు అంశాలపై ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి అనుమతులు, నిధులు సాధించడంపై ఎంపీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఎంపీలు కలిసి ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లాలని సీఎం కోరారు. హైదరాబాద్ మెట్రో రైల్ మొదటి దశ విలువ నిర్ధారణకు ఎస్‌బీఐ క్యాప్స్‌ను

తరువాయి 2లో..



యెమెన్ రాజధాని సనాలో సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సనా అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణాన్ని లక్ష్యంగా చేసుకుని సౌదీ అరేబియా వైమానిక దాడులు జరిపినట్లు ఇరాన్ మద్దతుదారులు హౌతీ తిరుగుబాటుదారులు ప్రకటించారు. ఈ దాడుల సందర్భంగా విమానాశ్రయ ప్రాంతంలో భారీ పేలుళ్లు సంభవించినట్లు హౌతీల ఆధీనంలోని అల్–మసీరా టీవీ ప్రసారం చేసిన వీడియోల్లో కనిపించింది. హౌతీల ఆరోపణ ప్రకారం.. సనా నగరంలోని పలు ప్రాంతాలపై వరుస వైమానిక దాడులు జరిగాయి. ముఖ్యంగా అంతర్జాతీయ విమానాశ్రయ పరిసరాల్లో పేలుళ్లు చోటుచేసుకున్నట్లు వెల్లడించారు. అయితే ఈ దాడుల వల్ల జరిగిన ప్రాణ, ఆస్తి నష్టంపై సమాచారాన్ని వెల్లడించలేదు. మరోవైపు దాడులపై సౌదీ అరేబియా నుంచి కూడా ఎలాంటి అధికారిక వెలువడలేదు.

ప్రతీకార జాబితాలో ట్రంప్, నెతన్యాహు

డొనాల్డ్ ట్రంప్

బెంజమిన్ నెతన్యాహు

జార్జియా మెలోనీ

మెలోనీ సహా 13మంది విదేశీ నేతల పేర్లు ప్రచురించిన ఇరాన్ మీడియా

- అమెరికా తాజా దాడుల తర్వాత ఉద్రిక్తతలు మరింత తీవ్రం
- మొజ్తాబా ఖమేనీ ప్రతీకార హెచ్చరికల మధ్య సంచలన పరిణామం
- గల్ఫ్‌లో అమెరికా స్థావరాలపై దాడులు చేశామని ఇరాన్ వెల్లడి

టెహ్రాన్: అమెరికా తాజాగా ఇరాన్‌పై జరిపిన దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు చెందిన స్థానిక మీడియా 13 మంది విదేశీ నేతల పేర్లతో కూడిన ఓ 'ప్రతీకార జాబితా'ను ప్రచురించడం సంచలనంగా మారింది. ఆ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో పాటు పలువురు ఐరోపా దేశాల ప్రముఖ నేతల పేర్లు ఉన్నట్లు పేర్కొంది. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన తర్వాత, ఆయన కుమారుడు మొజ్తాబా ఖమేనీ ప్రతీకారం తప్పదని ప్రకటించారు. తన తండ్రి మరణానికి బాధ్యులైన వారంతా మూల్యం చెల్లించాల్సి ఉంటుందని, ఇది దేశ ప్రజల ఆకాంక్ష అని ఆయన హెచ్చరించారు. ఈ వ్యాఖ్యల అనంతరం ప్రతీకార జాబితా వెలుగులోకి రావడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా, ఇరాన్‌లోని క్షిపణి ప్రయోగ కేంద్రాలు, డ్రోన్ స్థావరాలు, ఆయుధ గిడ్డంగులు, కమ్యూనికేషన్ వ్యవస్థలు సహా పలు

తరువాయి 2లో..

ఆరు హత్యల నరహంతకుడు మృతి

- పెంజర్ల వెంచర్‌లో రాజ్‌కుమార్ మృతదేహం లభ్యం
- పక్కనే పాయిజన్ బాటిల్.. ఆత్మహత్యగా అనుమానం
- మొబైల్‌లో సెల్ఫీ వీడియో
- బెట్టింగ్, అప్పులే జీవితాన్ని నాశనం చేశాయన్న నిందితుడు

2

పండుగల వేళ అడ్డగోలు ఛార్జీలు

- ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు
- విమాన టికెట్ ధరల దోపిడీపై కేంద్రానికి నోటీసు
- రెండు వారాల్లో నిబంధనలు సమర్పించాలని ఆదేశం

2

హసీనా స్వదేశానికి వస్తే జైలుకే

- న్యాయ ప్రక్రియ నుంచి ఎవరూ తప్పించుకోలేరు
- చట్ట ప్రకారమే చర్యలుంటాయి: షామా ఒబైద్ ఇస్లాం
- డిసెంబర్‌లో హసీనా రాకపై ఊహాగానాల మధ్య ప్రభుత్వం కీలక వ్యాఖ్యలు

3

సింగరేణిలో నిధుల దుర్వినియోగం

- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు కమీషన్ల రూపంలో దోచుకున్నాయి
- మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ఖర్చు చేసింది కూడా ఈ నిధులే
- ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతోనే సంస్థ ఆర్థిక పరిస్థితి దెబ్బతింది
- కేంద్రానికి 49శాతం వాటా ఉన్నప్పటికీ ఏనాడూ జోక్యం చేసుకోలేదు
- కార్మికుల ప్రయోజనాలకు కేంద్రం అండగా ఉంటుంది
- తాడిచర్ల–2 బొగ్గు గని కేటాయింపుతో 40–50 ఏళ్ల ఉత్పత్తికి భరోసా
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

ప్రజానావ, కొత్తగూడెం: సింగరేణి కాలరీస్ సంస్థ నిధుల విషయంలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని, సంస్థ నిధులను కమీషన్ల రూపంలో దుర్వినియోగం చేశాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. 'సింగరేణి భరోసా యాత్ర'లో భాగంగా సోమవారం కొత్తగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. సింగరేణి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని చెప్పారు. తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ను ఎలాంటి వేలం ప్రక్రియ లేకుండా నేరుగా సింగరేణికి కేటాయించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థతో పాటు అందులో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. దేశంలో వేలం లేకుండా ఒక మైనింగ్ సంస్థకు కేటాయించిన ఏకైక బొగ్గు బ్లాక్ తాడిచర్ల–2 అని పేర్కొన్నారు. ఈ గని అందుబాటులోకి రావడం ద్వారా సింగరేణి

తరువాయి 2లో..

ఏఐతో పెరిగిన ముప్పు

- బ్యాంకింగ్ రంగంపై కొత్త తరహా సైబర్ దాడులు
- డిజిటల్ ప్రపంచానికి షాక్ ఇస్తున్న నేరగాళ్లు
- బయోమెట్రిక్ గుర్తింపు, రియల్‌టైమ్ చెల్లింపులపైనే కన్ను
- తక్షణ చెల్లింపులతో తప్పని తిప్పలు
- వ్యవస్థల మధ్య ఖాళీలను వేటాడుతున్న హ్యాకర్లు
- థర్డ్ పార్టీ లోపాలే లక్ష్యంగా పెరుగుతున్న దాడులు
- హెచ్చరించిన డిజిటల్ థ్రెట్ రిపోర్ట్
- పాత భద్రతా విధానాలు సరిపోవని నివేదిక

న్యూఢిల్లీ: కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ గుర్తింపు వ్యవస్థలు, తక్షణ చెల్లింపుల విస్తరణతో సైబర్ ముప్పుల స్వరూపం వేగంగా మారుతోందని 'డిజిటల్ థ్రెట్ రిపోర్ట్ 2025–26 తాజా నివేదిక హెచ్చరించింది. ప్రస్తుత అనుసంధానిత డిజిటల్ వ్యవస్థలకు సంప్రదాయ సైబర్ భద్రతా విధానాలు సరిపోవని తేల్చి చెప్పింది. ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీ), ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సీఈఆర్‌టీ–ఇన్), ఫైనాన్స్ రంగ సైబర్ సెక్యూరిటీ రెస్పాన్స్ టీమ్ (సీఎస్ఐఆర్‌టీ–ఫిన్), సిసా సంయుక్తంగా రూపొందించిన ఈ నివేదికలో పలు అంశాలను వెల్లడించారు. గతంలో కేంద్రీకృత వ్యవస్థల ఆధారంగా సైబర్ భద్రతా విధానాలు ఉండేవని, ప్రస్తుతం ఆర్థిక రంగం అనుసంధానిత ప్లాట్‌ఫారాలు, ఏఐ ఆధారిత నిర్ణయాలు, ఎంబెడెడ్ ఫైనాన్స్, రియల్‌టైమ్ చెల్లింపులపై ఆధారపడుతోందని నివేదిక తెలిపింది. దీంతో సైబర్ దాడులకు అవకాశం ఉన్న మార్గాలు భారీగా పెరిగాయని పేర్కొంది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాలు సైబర్ నేరగాళ్లకు ప్రధాన లక్ష్యాలుగా మారుతున్నాయని హెచ్చరించింది. సైబర్ నేరగాళ్లు నేరుగా ఖాతాలను

ఛేదించడం కంటే.. డిజిటల్ విశ్వసనీయత వ్యవస్థను లక్ష్యంగా చేసుకుంటున్నారని నివేదిక వివరించింది. బయోమెట్రిక్ గుర్తింపు, భాగస్వామ్య యాప్‌లు, ఏఐ ఆధారిత వ్యవస్థలు, ఏపీఐలు, రియల్‌టైమ్ చెల్లింపులు, మూడో పార్టీ సేవల మధ్య ఉన్న లోపాలను ఉపయోగించుకుని దాడులు చేస్తున్నారని పేర్కొంది. ఒక వ్యక్తి డిజిటల్ గుర్తింపు దొంగిలించబడితే, అనేక ఖాతాలు, సేవలకు దీర్ఘకాలికంగా అనధికార ప్రవేశం పొందే ప్రమాదం ఉందని హెచ్చరించింది. డిజిటల్ వ్యవస్థలు వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, వాటికి అనుగుణంగా సైబర్ భద్రతా నిబంధనలు మారడం ఆలస్యమవుతోందని నివేదిక పేర్కొంది. ఈ అంతరాన్ని

తరువాయి 2లో..

మైనర్‌తో కారు నడిపించిన ఎస్ఐపై సస్పెన్షన్

- వైరల్ వీడియోతో వెలుగులోకి వచ్చిన ఘటన
- రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించారంటూ చర్యలు
- శాఖాపరమైన విచారణకు ఆదేశాలు జారీ

ప్రజానావ, హైదరాబాద్: మైనర్ మనవరాలితో కారు నడిపించిన ఘటనలో హైదరాబాద్‌కు చెందిన పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌పై వేటు పడింది. బాలిక కారు నడుపుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మైనర్‌కు డ్రైవింగ్ చేసే అవకాశం కల్పించడం, రోడ్డు భద్రతా నిబంధనలను ఉల్లంఘించిన నేపథ్యంలో ఎస్ఐ

తరువాయి 2లో..

ఆరు హత్యల నరహంతకుడు మృతి

- పెంజర్ల వెంచర్లో రాజ్‌కుమార్ మృతదేహం లభ్యం
- పక్కనే పాయిజన్ బాటిల్.. ఆత్మహత్యగా అనుమానం
- మొబైల్‌లో సెల్ఫీ వీడియో
- బెట్టింగ్, అప్పులే జీవితాన్ని నాశనం చేశాయన్న నిందితుడు

ప్రజానావ, రంగారెడ్డి బ్యూరో: తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన షాబాద్ ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ (29) మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలోని ఓ వెంచర్‌లో సోమవారం ఉదయం అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, మృతదేహం పక్కనే విషం బాటిల్ లభ్యమైంది. దీంతో రాజ్‌కుమార్ విషం తాగి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతికి గల కచ్చితమైన కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందని, పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. షాబాద్‌లో ఒకే రాత్రి ఆరుగురిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన అనంతరం రాజ్‌కుమార్ పరారైన విషయం తెలిసిందే. అతడిని పట్టుకునేందుకు పోలీసులు యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టారు. 14 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారిపై హోటళ్లు, లాడ్జీలు, దాబాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు అతడి బంధువులు, స్నేహితులు, పరిచయస్తులను ప్రశ్నించారు. ఈ క్రమంలో పెంజర్లలో అతడి మృతదేహం లభ్యమైంది. ఈ నెల 10వ తేదీ అర్ధరాత్రి రాజ్‌కుమార్ మారణహోమానికి పాల్పడ్డాడు. ఓ బాలికను వేధించిన కేసులో తనపై పోక్సో చట్టం కింద కేసు నమోదైందనే కక్షతో తొలుత బాలిక తల్లి, నానమ్మలను కత్తితో పొడిచి హతమార్చాడు. అనంతరం బాలికను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి గొంతుకోసి చంపేశాడు. అక్కడి నుంచి నేరుగా తన ఇంటికి వెళ్లి భార్యతో పాటు నిద్రిస్తున్న ఇద్దరు చిన్నారులను కూడా దారుణంగా హత్య చేశాడు. కేవలం అరగంట వ్యవధిలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఒక బాలిక, ఇద్దరు చిన్నారులను పొట్టనబెట్టుకోవడంతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం నెలకొంది.

మొబైల్‌లో సెల్ఫీ వీడియో

రాజ్‌కుమార్ మృతదేహం వద్ద లభ్యమైన మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియోను గుర్తించినట్లు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు. సుమారు 2 నిమిషాల 26 సెకన్ల నిడివి గల ఈ వీడియోను హత్యలకు ముందు శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో రికార్డు చేసినట్లు వెల్లడించారు. ఆ వీడియోలో తనకు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు ఉందని, ఇందుకోసం 16 సిమ్ కార్డులు ఉపయోగించినట్లు రాజ్‌కుమార్ పేర్కొన్నట్లు సీపీ తెలిపారు. బెట్టింగ్ కారణంగా తీవ్ర అప్పుల్లో కూరుకుపోయానని, జీవితంపై విరక్తి కలిగిందని, తాను నమ్మిన ఓ యువతి మోసం చేయడంతో మానసికంగా కుంగిపోయానని వీడియోలో చెప్పినట్లు వెల్లడించారు. ఈ వీడియోతో పాటు ఇతర ఆధారాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ విశ్లేషణ అనంతరం కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. రాజ్‌కుమార్ మృతితో షాబాద్ ఆరు హత్యల కేసులో నిందితుడి కోసం సాగిన భారీ గాలింపు చర్యలకు తెరపడినప్పటికీ, ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు, నిందితుడి కదలికలు, ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై విచారణ కొనసాగుతోందన్నారు.

పండుగల వేళ అడ్డగోలు ఛార్జీలు

- ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు
- విమాన టికెట్ ధరల దోపిడీపై కేంద్రానికి నోటీసు
- రెండు వారాల్లో నిబంధనలు సమర్పించాలని ఆదేశం

న్యూఢిల్లీ: పండుగలు, సెలవుల సమయంలో విమానయాన సంస్థలు ప్రయాణికుల నుంచి అధిక టికెట్ ఛార్జీలు వసూలు చేస్తున్నాయంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. విమాన టికెట్ ధరల నియంత్రణకు సంబంధించి రూపొందిస్తున్న నిబంధనలను రెండు వారాల్లో కోర్టు ముందుంచాలని ఆదేశించింది. అలాగే ఈ అంశంపై సమగ్ర నివేదికను కూడా సమర్పించాలని కేంద్రాన్ని కోరింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం సామాజిక కార్యకర్త లక్ష్మీ నారాయణన్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని సోమవారం విచారించింది. ప్రైవేటు విమానయాన సంస్థలు టికెట్ ధరల నిర్ణయంలో పారదర్శకత పాటించడం లేదని, ముఖ్యంగా పండుగలు, సెలవుల సమయంలో డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ఛార్జీలను భారీగా పెంచుతున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది రవీంద్ర శ్రీవాస్తవ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇలాంటి ధరల పెరుగుదలను నియంత్రించే సమర్థవంతమైన వ్యవస్థ ప్రస్తుతం లేదని, స్వతంత్ర నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది, భారతీయ వాయుయాన్ అధినియం–2024 అమలుకు సంబంధించిన ముసాయిదా నిబంధనలను సిద్ధం చేస్తున్నామని, త్వరలో వాటిని పార్లమెంట్ ముందుకు తీసుకురానున్నట్లు ధర్మాసనానికి తెలిపారు. కేంద్రం వివరణను నమోదు చేసిన సుప్రీంకోర్టు, రూపొందిస్తున్న నిబంధనలను రెండు వారాల్లో సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశిస్తూ, కేసు తదుపరి విచారణను ఆగస్టు 3కు వాయిదా వేసింది.

పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత తప్పనిసరి

పౌరసత్వాన్ని ధ్రువీకరించే ప్రక్రియతో పాటు ఒక వ్యక్తిని విదేశీయుడిగా గుర్తించే విధానం పూర్తిగా పారదర్శకంగా, చట్టబద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పౌరసత్వం, విదేశీయుల హోదా వంటి అంశాలు రాజ్యాంగపరంగా అత్యంత కీలకమైనవని పేర్కొంటూనే, అక్రమంగా భారత పౌరసత్వం పొందే ప్రయత్నాలను అడ్డుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉందని వెల్లడించింది. అయితే, అలాంటి వ్యవహారాల్లో న్యాయపరమైన ప్రక్రియకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేసింది. అస్సాంలో విదేశీయులుగా ప్రకటించబడిన 27 మంది దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా గువాహటి హైకోర్టు, విదేశీయుల ట్రైబ్యునళ్లు ఇచ్చిన తీర్పులను పక్కన పెట్టింది.

టైపింగ్ పొరపాట్లే వివాదానికి కారణం

పాత ఓటర్ల జాబితాల్లో పేర్ల స్పెల్లింగ్, టైపింగ్‌లో ఉన్న స్వల్ప వ్యత్యాసాలను ఆధారంగా తీసుకుని తమను విదేశీయులుగా ప్రకటించారని అస్సాంకు చెందిన 27 మంది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇలాంటి చిన్నచిన్న సాంకేతిక లోపాల ఆధారంగా ఒకరి పౌరసత్వాన్ని అనుమానించడం సరికాదని వారు వాదించారు. పిటిషనర్ల వాదనలు విన్న సుప్రీంకోర్టు వారికి తాత్కాలిక ఊరట కల్పించింది. అయితే వారి పౌరసత్వానికి సంబంధించిన ఆధారాలను తాము పరిశీలించి ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులను సంబంధిత విదేశీయుల ట్రైబ్యునళ్లు మరోసారి సమగ్రంగా విచారించాలని ఆదేశించిన కోర్టు, ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. న్యాయబద్ధమైన విచారణ అనంతరం మాత్రమే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించింది.

10 వేల ఎకరాల సాగునీటి
కాలువల నిర్మాణంపై నిర్లక్ష్యం

- మంజూరైన నిధులు మురిగిపోతున్నా చేపట్టని పనులు
- నిరసనలు కొనసాగిస్తున్నా 15 గ్రామాల రైతాంగానికి అన్యాయం
- వెంటనే పనులు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గుంటి వేణు డిమాండ్

ప్రజానావ, సిరిసిల్ల : 15 గ్రామాలలోని పదివేల ఎకరాలకు సాగునీరు అందించే ఐఎం కాలువ నిర్మాణం చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, మంజూరైన రూ.3.19 కోట్ల నిధులు ఏమయ్యాయో స్పష్టత లేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గుంటి వేణు జిల్లా కార్యదర్శి సోమ నాగరాజులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం సిరిసిల్ల సుభాష్ నగర్ సీపీఐ కార్మిక భవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గుంటి వేణు, సోమ నాగరాజు లు మాట్లాడుతూ ఐఎం కాలువ నిర్మాణం చేయాలని గత సంవత్సరం లోనూ, ఈ సంవత్సరం మార్చి, ఏప్రిల్ లోను ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపురం తంగళ్ళపల్లి మండలాల మధ్య పది గ్రామాలకు సంబంధించిన రైతులు 35 రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. రంగనాయక సాగర్ నుండి తంగళ్ళపల్లి మండలంలోని 10 గ్రామాలు, ఇల్లంతకుంట మండలంలోని మూడు గ్రామాలకు సాగునీరుకై కాలువ నిర్మాణం చేయాలని రైతాంగ ఉద్యమాలు నిర్మాణం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మూడు కోట్ల 19 లక్షల రూపాయలు కెనాల్ కోసం కేటాయించారన్నారు. అలాగే రంగనా యక సాగర్ నుండి దాచారం మీదుగా చిన్న లింగా పురం, బస్వాపురం, బాలమల్లు పల్లె, అంకుసా పురం, తాడూరు, గోపాలరావు పల్లె, లక్ష్మి పురం తదితర గ్రామాలకు చెందిన 14 చెరువుకుంటల ద్వారా ఈ కాలువ నిర్మాణం జరిగితే 10 వేల ఎకరాలకు సాగునీరు అందించే కాలువను ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా వెంటనే పరిహార అందించడం, టెండర్లు వేసి కాలువల పనుల నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇది అమలు చేయని పక్షంలో ఆయా 15 గ్రామాలతో కలిపి పెద్ద ఎత్తున ఉద్యమ నిర్మాణం చేయాల్సిన అవసరం ఉన్నదని, ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రెండేళ్లలో 60 వేల కేసుల పరిష్కారం

- ఇది ఎస్సీ కమిషన్ చరిత్రలోనే రికార్డు
- బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం
- రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తున్నాం
- డిజిటల్ విధానాలతో ఫిర్యాదుల పరిష్కారం వేగవంతం
- ఎన్‌సీఎస్సీ చైర్మన్ కిశోర్ మక్వానా

ప్రజానావ, హైదరాబాద్: జాతీయ ఎస్సీ కమిషన్ (ఎన్‌సీఎస్సీ) గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 60 వేల కేసులను పరిష్కరించిందని కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానా తెలిపారు. అణగారిన వర్గాలకు న్యాయం అందించడం, వారి హక్కులను పరిరక్షించడం కోసం కమిషన్ నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో సోమవారం పునరుద్ధరించిన ఎన్‌సీఎస్సీ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం ఎస్సీల హక్కుల పరిరక్షణకు కమిషన్‌కు ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా గత 75 ఏళ్లుగా కమిషన్ పనిచేస్తోందన్నారు. ప్రజల్లో కమిషన్‌పై నమ్మకం పెరుగుతోందని కిశోర్ మక్వానా తెలిపారు. గత రెండేళ్లలో 60 వేలకుపైగా ఫిర్యాదులను పరిష్కరించడం కమిషన్ చరిత్రలోనే అత్యధిక పరిష్కార రేటుగా నిలిచిందన్నారు. ప్రతి ఫిర్యాదుదారుడికి సకాలంలో న్యాయం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎస్సీ కమిషన్‌కు ఉన్న చట్టబద్ధ అధికారాలను సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ వివరించారు. నోటీసులు జారీ చేయడం, సమన్లు పంపడం, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునే అధికారం కమిషన్‌కు ఉందన్నారు. ఎస్సీ వర్గాలకు చెందిన పారిశ్రామికవేత్తలకు ప్రస్తుతం అందుతున్న ఆర్థిక సహకారంపై రాంచందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఎస్ఎంఈ రంగ అభివృద్ధి, అణగారిన వర్గాల సంక్షేమానికి ప్రజాప్రతినిధులు, విధాన నిర్ణేతలు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎస్సీ పారిశ్రామికవేత్తల సమస్యల పరిష్కారానికి కమిషన్ అండగా ఉంటుందని తెలిపారు. ఎన్‌సీఎస్సీ కార్యదర్శి గుడే శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యాన్ని తగ్గించేందుకు డిజిటల్ సాంకేతికత, ఆధునిక మౌలిక సదుపాయాలను వినియోగిస్తున్నామని చెప్పారు.

ముఖ్యమంత్రితో భేటీ

అనంతరం ఎన్‌సీఎస్సీ చైర్మన్ కిశోర్ మక్వానా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిశారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను సీఎం వివరించినట్లు సీఎంవో వెల్లడించింది. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ అమలు అంశంపై కూడా చర్చ జరిగినట్లు తెలిపింది. విద్యార్థుల్లో కుల వివక్షను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం పేర్కొన్నారు. ఎస్సీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని కోరినట్లు సీఎంవో వెల్లడించింది.

విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ

పాల్గొన్న ప్రభుత్వ విప్

ప్రజానావ, వేములవాడ : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ నులి పురుగు నివారణ మాత్రలను ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రానున్న రోజుల్లో వేములవాడ నియోజకవర్గంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' ప్రారంభం కానున్నాయని చెప్పారు. చివరగా విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.

హర్మ్యూజ్‌పై అమెరికా 'పట్టు'

- జలసంధిలో ఇరాన్ నౌకల రాకపోకలకు అడ్డుకట్ట
- సరుకు నౌకలపై 20 శాతం రుసుము వసూలుకు ట్రంప్ నిర్ణయం
- మళ్లీ చమురు ధరలకు రెక్కలు
- ప్రపంచ దేశాల్లో ఆందోళన

దుబాయ్: ఇరాన్‌పై ఒత్తిడి పెంచే దిశగా అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధిలో ఇరాన్ నౌకల రాకపోకలను నియంత్రించేందుకు దిగ్బంధాన్ని పునరుద్ధరిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మార్గంలో ప్రయాణించే అర్హత కలిగిన సరకు నౌకల నుంచి 20 శాతం రుసుము వసూలు చేయనున్నట్లు వెల్లడించారు. ట్రంప్ సోమవారం సామాజిక మాధ్యమం ద్వారా ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఇరాన్‌కు చెందిన నౌకలు లేదా ఆ దేశంతో వ్యాపార సంబంధాలు ఉన్న నౌకలను హర్మ్యూజ్ జలసంధిలోకి అనుమతించబోమని తెలిపారు. ఇతర దేశాల నౌకలకు మాత్రం సాధారణ రాకపోకలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. జలసంధిలో భద్రత, రక్షణ చర్యలకు అయ్యే ఖర్చులను భర్తీ చేసేందుకే రుసుము విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ చమురు, సహజ వాయువు రవాణాలో దాదాపు ఐదో వంతు హర్మ్యూజ్ జలసంధి ద్వారానే జరుగుతుంది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడం అంతర్జాతీయ ఇంధన సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఇరాన్, అమెరికా మధ్య శాంతి చర్చలు నిలిచిపోవడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. హర్మ్యూజ్ జలసంధిలో ఇరాన్ ఓ కంటైనర్ నౌకపై దాడి చేసిన ఘటన అనంతరం పరిస్థితి తీవ్రంగా మారింది.

మాకూ హక్కు ఉంది: ఇరాన్

హర్మ్యూజ్ జలసంధిపై తమకు నియంత్రణ హక్కు ఉందని ఇరాన్ ప్రకటించింది. తాత్కాలిక శాంతి ఒప్పందం ప్రకారం నౌకల రాకపోకలను పర్యవేక్షించే అధికారం తమకుందని తెలిపింది. ఇరాన్ అత్యున్నత నేతకు సలహాదారు మహ్మద్ మొఖ్బర్ మాట్లాడుతూ.. జలసంధి విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కూడా ఈ ప్రాంతం తమ పరిధిలోనే ఉందని పేర్కొంది. ఇదిలాఉంటే హర్మ్యూజ్ ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు భారీగా పెరిగాయి. సోమవారం ధరలు దాదాపు 5 శాతం ఎగబాకగా, అనంతరం కొంత తగ్గాయి. అమెరికా ముడిచమురు ధర బ్యారెల్‌కు 72.92 డాలర్ల వద్ద నమోదైంది.

ఇరాన్‌లో అమెరికా దాడులు

ఇదిలా ఉండగా, ఇరాన్‌లోని పలు ప్రాంతాలపై అమెరికా సైన్యం దాడులు నిర్వహించినట్లు ప్రకటించింది. గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలు, క్షిపణి, డ్రోన్ స్థావరాలు, చిన్న నౌకలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. అమెరికా మిత్ర దేశాలైన బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లలో క్షిపణి హెచ్చరిక సైరన్లు మోగాయి. జోర్డాన్ సైన్యం నాలుగు ఇరాన్ క్షిపణులను కూల్చివేసినట్లు ప్రకటించింది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని వెల్లడించింది. ఇరాన్, అమెరికా మధ్య యుద్ధ ముగింపు, అణు కార్యక్రమంపై ఒప్పందం కోసం కొనసాగుతున్న చర్చలు తాజా పరిణామాలతో మరింత అనిశ్చితిలో పడ్డాయి. పాకిస్థాన్, ఖతార్, ఈజిప్ట్‌ల మధ్యవర్తిత్వం తో కాల్పుల విరమణ ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ.. హర్మ్యూజ్ వివాదం కొత్త ఆందోళనలకు దారితీస్తోంది.

సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ డే లక్ష్యం

- 29 ఫిర్యాదులు స్వీకరణ
- ఎస్పీ మహేష్ బీ.గితే

ప్రజానావ, సిరిసిల్ల : ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 29 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించు కుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలం దించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

మైనర్‌తో కారు నడిపించిన ఎస్ఐపై సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

పూజారి తిరుపతిని సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. వైరల్ అయిన వీడియోలో ఎస్ఐ తిరుపతి కారు ముందు సీటులో కూర్చుని ఉండగా.. ఆయన మైనర్ మనవరాలు డ్రైవింగ్ సీటులో కారు నడుపుతున్న దృశ్యాలు కనిపించాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ప్రశ్నించగా, మైనర్ బాలిక డ్రైవింగ్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వీడియోలో బాలిక తన తాత ఎస్ఐ అని చెప్పినట్లు వినిపించింది. అనంతరం ఎస్ఐ కూడా వాహనం ఆటోమేటిక్ అని, తన నియంత్రణలోనే ఉందని వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. స్థానికులు ప్రశ్నించడంతో ఆయన డ్రైవింగ్ సీటులోకి మారారు.

డీజీపీ ఆదేశాలతో చర్యలు

ఈ ఘటనపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. సంబంధిత అధికారిపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు శాఖాపరమైన విచారణ చేపట్టాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు. మైనర్‌కు డ్రైవింగ్ అవకాశం కల్పించడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి అంశాల ఆధారంగా చర్యలు తీసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఎస్ఐ తిరుపతిపై బీఎన్ఎస్ సెక్షన్ 125తో పాటు మోటారు వాహనాల చట్టంలోని 184, 180 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

ప్రాజెక్టులను పట్టాలెక్కిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

కన్సల్టెంట్‌గా నియమించే ప్రక్రియను వేగవంతం చేయాలని, రెండో దశ మెట్రోకు సంబంధించిన నివేదిక తయారీని పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిపాదిత ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో పనులు ప్రారంభించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం పొందేలా కృషి చేయాలని సీఎం ఎంపీలకు సూచించారు. దక్షిణ భాగంలో భూసేకరణ ప్రక్రియకు సహకారం పొందాలని కోరారు. మూసీ నది అభివృద్ధి పనుల్లో తొలి దశను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' పథకం కింద చేర్చేలా కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్‌లాల్‌ను కలవాలని సూచించారు.

తుంగభద్ర జలాలపై చొరవ

తుంగభద్ర నది డ్యామ్, కాలువల్లో పూడిక తొలగింపునకు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సహకారం పొందేందుకు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలవాలని సీఎం సూచించారు. తద్వారా తెలంగాణకు కేటాయించిన 15.09 టీఎంసీల నీటిని పూర్తిగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత విమానాశ్రయాల్లో నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాలింగ్ (ఎంఆర్ఓ), ఎయిర్ కార్గో సదుపాయాల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు సాధించేలా ఎంపీలు ప్రయత్నించాలని సీఎం కోరారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ ఎంపీలతో పాటు బీజేపీ లోక్‌సభ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ కూడా హాజరయ్యారు.

ప్రతీకార జాబితాలో
ట్రంప్, నెతన్యాహు, మెలోనీ

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యాలపై దాడులు జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దీనికి ప్రతిస్పందనగా బహ్రెయిన్, కువైట్, ఖతార్, జోర్డాన్, ఒమన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్‌లో అమెరికాకు చెందిన డ్రోన్ ఫ్లీట్, క్షిపణి లాంచర్లు, ఆయుధ నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు కూడా వెల్లడించింది. అమెరికా చర్యల వల్లే హర్మ్యూజ్ జలసంధిలో అంతర్జాతీయ నౌకాయానానికి అంతరాయం ఏర్పడిందని ఇరాన్ ఆరోపించింది. పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పేందుకు ఇప్పటివరకు సాగిన దౌత్య చర్చలను అమెరికా తాజా దాడులు నిర్వీర్యం చేశాయని టెహ్రాన్ విమర్శించింది. దీంతో ప్రాంతంలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి.

సింగరేణిలో నిధుల దుర్వినియోగం

(మొదటిపేజీ తరువాయి)

మరో 40 నుంచి 50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తిని కొనసాగించే అవకాశం ఉంటుందని తెలిపారు.

కొత్త గనులు లేక సింగరేణిపై భారం

సింగరేణి ప్రస్తుతం పలు సమస్యలను ఎదుర్కొంటోందని కిషన్‌రెడ్డి అన్నారు. సంస్థ ఉత్పత్తి, ఆదాయం, ఉద్యోగుల సంఖ్య క్రమంగా తగ్గుతున్నాయని పేర్కొన్నారు. సంస్థ భవిష్యత్ కొనసాగింపునకు కొత్త బొగ్గు బ్లాక్‌లు అత్యవసరమని తెలిపారు. కొత్త బొగ్గు గనుల వేలం ప్రక్రియలో కోల్ ఇండియా, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ వంటి సంస్థలు పాల్గొన్నప్పటికీ.. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణిని వేలంలో పాల్గొనకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. తన విజ్ఞప్తి మేరకు ప్రధాని నరేంద్ర మోదీ తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించేందుకు అంగీకరించారని, న్యాయశాఖ అనుమతుల అనంతరం ప్రక్రియ పూర్తయిందని వివరించారు. సింగరేణి కష్టపడి సంపాదించిన నిధులను గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం సక్రమంగా వినియోగించలేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. కమీషన్ల పేరుతో సంస్థ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వ విద్యుత్ ఉత్పత్తి సంస్థకు సరఫరా చేసిన బొగ్గుకు సంబంధించిన బకాయిలు చెల్లించకపోవడంతో సింగరేణి ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నదని అన్నారు. గత ప్రభుత్వాల కాలం నుంచి పేరుకుపోయిన బకాయిలు ప్రస్తుతం రూ.54 వేల కోట్లకు చేరాయని తెలిపారు.

ఆ ఖర్చు ప్రభుత్వమే ఎందుకు భరించలేదు?

హైదరాబాద్‌లో లియోనల్ మెస్సీ పాల్గొన్న ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహణకు సింగరేణి నిధులను వినియోగించారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ఆ ఖర్చును ప్రభుత్వ బడ్జెట్ నుంచి ఎందుకు భరించలేదని ప్రశ్నించారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నప్పటికీ.. సంస్థ పరిపాలనా వ్యవహారాల్లో ఏనాడూ జోక్యం చేసుకోలేదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్టీపీసీ, కోలిండియా వంటి ప్రభుత్వ రంగ సంస్థలకు కేంద్రం సకాలంలో చెల్లింపులు చేస్తోందని, సింగరేణి అభివృద్ధికి కూడా అవసరమైన సహకారం కొనసాగిస్తామని తెలిపారు. కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు.

ఏఐతో పెరిగిన ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

అధునాతన సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా వినియోగించుకుంటున్నారని తెలిపింది.

కొత్త భద్రతా విధానం అవసరం

ప్రస్తుతం సైబర్ భద్రత అనేది ఒక సంస్థ పరిధిని రక్షించడం మాత్రమే కాదని, భాగస్వామ్య సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారాలు, ఏఐ నమూనాలు, ఏపీఐలు, సాంకేతిక మౌలిక సదుపాయాల మధ్య విస్తరించిన సంక్లిష్ట వ్యవస్థగా మారిందని నివేదిక పేర్కొంది. మారుతున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా నిరంతర పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, అధునాతన భద్రతా చర్యలు అవసరమని సూచించింది.

తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ

ఏపీతో రేవంత్‌రెడ్డి మిలాఖత్

- పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు తెరచాటుగా సహకారం
- ఏపీ అక్రమ ప్రాజెక్టును అడ్డుకునేందుకు సుప్రీంలో కనీసం పటిష్టమైన పిటిషన్ వేయలేదు
- రేవంత్ చేస్తున్న ద్రోహాన్ని తెలంగాణ సమాజం క్షమించదు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

ప్రజానావ, హైదరాబాద్ : గోదావరిలో తెలంగాణ నీటి హక్కులను సీఎం రేవంత్ రెడ్డి కాలరాస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం– బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు తెరచాటుగా ఏపీకి రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని మండిపడ్డారు. పోలవరం – బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం వేసిన పిటిషన్ లో లోపాలున్నాయని సుప్రీంకోర్టు పేర్కొన్న నేపథ్యంలో కవిత ఎక్స్ లో పోస్ట్ చేశారు. రేవంత్ రెడ్డి చేస్తున్న ద్రోహాన్ని తెలంగాణ సమాజం క్షమించదని ఆమె అన్నారు.

రాష్ట్రానికి సున్నం పెట్టి.. చంద్రబాబుకు గురుదక్షిణ

గోదావరిలో తెలంగాణ నీటి హక్కులను ఫణంగా పెట్టి ఏపీకి సీఎం రేవంత్‌రెడ్డి తెరచాటుగా సహకరిస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మన నీటి హక్కులకు నష్టం చేసే పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు ఏపీకి సీఎం రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని మండిపడ్డారు. ఏపీ అక్రమ ప్రాజెక్టుపై తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్ లో లోపాలు ఉన్నాయని చెప్తూ ఏపీ ప్రభుత్వానికి కనీసం నోటీసులు ఇవ్వటానికి సుప్రీంకోర్టు నిరాకరించిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి సున్నం పెట్టి.. ఏపీ సీఎం చంద్రబాబుకు గురు దక్షిణగా గోదావరి నీళ్లను రేవంత్ రెడ్డి కట్టబెడుతున్నారని మండిపడ్డారు. బనకచర్ల విషయంలో ఏపీకి రేవంత్ ఎంతగా సహకరిస్తున్నాడో ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ ను బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు.

రేవంత్‌రెడ్డిని తెలంగాణ సమాజం క్షమించదు

తెలంగాణ కు ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ఈ ప్రాంత హక్కులను కాపాడాల్సింది పోయి ద్రోహం చేయటం సరికాదన్నారు. ఆయన చేస్తున్న పనికి తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదని అన్నారు. ఈ ముఖ్యమంత్రికి నీళ్ల సోయి లేకపోవడం తెలంగాణకు శాపంగా మారిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీతో ముఖ్యమంత్రితో మిలాఖత్ రాజకీయాలు మాని తెలంగాణకు హక్కుల కోసం రేవంత్ రెడ్డి పనిచేయాలని కవిత సూచించారు. ఏపీ తలపెట్టిన పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై పటిష్టమైన పిటిషన్ ను సుప్రీం కోర్టులో దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాజెక్టును అడ్డుకోకపోతే తెలంగాణకు శాశ్వతంగా అన్యాయం చేసిన వారవుతారని హెచ్చరించారు.

రామాలయ విరాళాలపై ప్రధాని మౌనం వీడాలి

న్యూఢిల్లీ: అయోధ్య రామాలయానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం జరిగినట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలను మరింత తీవ్రతరం చేసింది. కోట్లాది మంది రామభక్తుల విశ్వాసానికి సంబంధించిన ఈ అంశంపై ప్రధాని మౌనం వీడి దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సోమవారం డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందిస్తూ.. రామాలయ విరాళాల వ్యవహారంపై ప్రధాని స్పందించకపోవడం ప్రజల విశ్వాసానికి భంగం కలిగించినట్లేనని వ్యాఖ్యానించారు. అవినీతిపై జీరో టాలరెన్స్ విధానాన్ని ప్రకటించే ప్రధాని ఈ అంశంపై నెల రోజులుగా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ గత నాలుగు రోజులుగా దేశవ్యాప్తంగా 50 విలేకరుల సమావేశాలు నిర్వహించినట్లు జైరాం రమేశ్ తెలిపారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లోనూ ఈ విషయాన్ని లేవనెత్తనున్నట్లు పేర్కొన్నారు. విరాళాల దుర్వినియోగంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటీ) నివేదికలో వెల్లడైన అంశాలు పూర్తి వాస్తవాల్లో కొంత భాగమేనని కాంగ్రెస్ ఆరోపించింది.

ఆకాశమే హద్దు కాదు..

- అంతరిక్ష భవిష్యత్తుకు నాయకులుగా ఎదగండి
- 2040 లక్ష్యాల సాధనలో యువత కీలకపాత్ర పోషించాలి
- వ్యోమగామి శుభాంశు శుక్లా
- ఐఐటీ హైదరాబాద్‌లో విద్యార్థులతో ప్రత్యేక ఖాముఖి

THE SECOND ORBIT
BOOK LAUNCH EVENT
GROUP CAPTAIN
HANSHU SHUKLA, AC
THE
COND
RBIT

ప్రజానావ, హైదరాబాద్: భారత అంతరిక్ష కార్యక్రమంలో భాగస్వాములుగా మాత్రమే కాకుండా, దేశ అంతరిక్ష భవిష్యత్తుకు నాయకులుగా ఎదగాలని ప్రముఖ వ్యోమగామి శుభాంశు శుక్లా విద్యార్థులకు పిలుపునిచ్చారు. దేశం అంతరిక్ష రంగంలో కీలక దశలో ఉందని, భవిష్యత్ లక్ష్యాల సాధనకు నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పరిశోధకులు అత్యవసరమని పేర్కొన్నారు. ఐఐటీ హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. 2040 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, భారతీయ వ్యోమగామిని చంద్రుడి పైకి పంపడం వంటి ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను దేశం నిర్దేశించుకుందని తెలిపారు. వాటిని విజయవంతం చేయాలంటే యువత సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవ డంతో పాటు పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆకాశమే హద్దు కాదు.. నాకు కాదు.. మీకు కాదు.. భారతదేశానికి కాదు అంటూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపిన శుభాంశు శుక్లా.. అంతరిక్ష రంగంలో సేవ చేయడం దేశ నిర్మాణంలో భాగమని అన్నారు. అంతకుముందు హైదరాబాద్‌లో నిర్వహించిన ది సెకండ్ ఆర్బిట్ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భం గా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ మాట్లాడుతూ, శుభాంశు శుక్లా జీవిత ప్రయాణం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. గతేడాది 18 రోజుల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో మిషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన శుభాంశు శుక్లా, ఐఎస్ఎస్‌ను సందర్శించిన తొలి భారతీయు డిగా చరిత్ర సృష్టించారు. 1984లో రాకేష్ శర్మ అంతరిక్ష యాత్ర తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయుడిగా గుర్తింపు పొందారు.

హసీనా స్వదేశానికి వస్తే జైలుకే

- న్యాయ ప్రక్రియ నుంచి ఎవరూ తప్పించుకోలేరు
- చట్ట ప్రకారమే చర్యలుంటాయి: షామా ఒబైద్ ఇస్లాం
- డిసెంబర్‌లో హసీనా రాకపై ఊహాగానాల మధ్య ప్రభుత్వం కీలక వ్యాఖ్యలు

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వస్తే చట్ట ప్రకారమే ఆమెను జైలుకు పంపిస్తామని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి షామా ఒబైద్ ఇస్లాం స్పష్టం చేశారు. హసీనా స్వచ్ఛందంగా లొంగిపోయినా న్యాయ ప్రక్రియ ప్రకారమే తదుపరి చర్యలు కొనసాగుతాయని సోమవారం తెలిపారు. హసీనా ఈ ఏడాది డిసెంబర్ లో బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చే అవకాశముందని ఇటీవల వెలువడిన వార్తల నేపథ్యంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆమె భారత్‌లో లొంగిపోయినా, బంగ్లాదేశ్‌లో లొంగిపోయినా చట్టం ముందు అందరూ సమానమేనని, ముందుగా న్యాయపరమైన ప్రక్రియను ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హసీనాపై ఇప్పటికే న్యాయస్థానం తీర్పు వెలువడిందని, శిక్ష పడిన వ్యక్తి చేసిన ప్రకటనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని షామా ఒబైద్ అన్నారు. ఆమె స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత అన్ని చర్యలు చట్టబద్ధ విధానంలోనే కొనసాగుతాయని స్పష్టం చేశారు. 2024 ఆగస్టు 5న విద్యార్థుల ఉద్యమం నేపథ్యంలో హసీనా ప్రభుత్వం కూలిపోవడంతో ఆమె భారత్‌కు వెళ్లారు. అనంతరం విద్యార్థుల ఆందోళనల అణచివేత సందర్భంగా మానవత్వానికి వ్యతిరేక నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఢాకాలోని ప్రత్యేక ట్రైబ్యునల్ ఆమెకు గైర్హాజరీలో మరణశిక్ష విధించింది. అయితే ఈ ఆరోపణలు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని హసీనా ఖండించారు. ఇదిలా ఉండగా, హసీనాను విచారణ కోసం బంగ్లాదేశ్‌కు అప్పగించాలని భారత్ ను కోరినట్లు షామా ఒబైద్ తెలిపారు. ఈ ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. విదేశాల్లో ఉన్న అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలకు ధైర్యం చెప్పేందుకే హసీనా స్వదేశానికి వస్తానని ప్రకటిస్తున్నారని వ్యాఖ్యానించిన ఆయన, చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని స్పష్టం చేశారు.

రష్యా క్షిపణులకు 'యూరప్ కవచం'

- ఉక్రెయిన్‌తో కలిసి 10 దేశాల రక్షణ కూటమి ఏర్పాటు
- క్షిపణి నిరోధక సామర్థ్యాల అభివృద్ధికి నిర్ణయం



పారిస్: రష్యా నుంచి ఎదురవుతున్న బ్యాలిస్టిక్ క్షిపణుల ముప్పును ఎదుర్కొనేందుకు ఉక్రెయిన్‌తో పాటు తొమ్మిది యూరోపియన్ దేశాలు కొత్త కూటమిగా ఏర్పడ్డాయి. యూరప్ వ్యాప్తంగా సమగ్ర క్షిపణి రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ కూటమిని ఏర్పాటు చేసినట్లు ఆయా దేశాలు సోమవారం ప్రకటించాయి. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీతో జరిగిన సమావేశంలో ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, నార్వే, స్పెయిన్, స్వీడన్, బ్రిటన్‌లు ఉక్రెయిన్‌తో కలిసి ఈ కూటమిలో భాగస్వాములయ్యాయి. భవిష్యత్‌లో ఎదురయ్యే క్షిపణి ముప్పులను ఎదుర్కొనేందుకు సమీకృత రక్షణ వ్యవస్థ అవసరమని దేశాలు పేర్కొన్నాయి. రష్యా దాడులను ఎదుర్కొంటున్న ఉక్రెయిన్‌కు క్షిపణి నిరోధక చర్యల్లో ఉన్న అనుభవాన్ని యూరప్ రక్షణ వ్యవస్థ అభివృద్ధికి వినియోగించుకోనున్నట్లు వెల్లడించాయి. కాగా, కొత్త రక్షణ వ్యవస్థ ఎప్పటిలోగా అందుబాటులోకి వస్తుందనే వివరాలను మాత్రం ప్రకటించలేదు. మరిన్ని దేశాలు ఈ కూటమిలో చేరే అవకాశం ఉందని తెలిపాయి.

దాడులకు ప్రతీకారం తప్పదు: పుతిన్

ఉక్రెయిన్ ఇటీవల రష్యా చమురు శుద్ధి కేంద్రాలు, నౌకలు, టెర్మినల్స్‌పై జరిపిన దాడులకు ప్రతీకారం తప్పదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరించారు. రష్యా భూభాగంపై జరిగే ప్రతి దాడికి మరింత తీవ్రంగా స్పందిస్తామని స్పష్టం చేశారు. మరోవైపు చలికాలంలో రష్యా దాడులు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్న ఉక్రెయిన్.. విద్యుత్, నీరు, వేడి సరఫరాలను రక్షించుకునేందుకు యూరప్ దేశాల సహకారంతో క్షిపణి రక్షణ వ్యవస్థలను వేగవంతం చేయాలని భావిస్తోంది. ఇదిలాఉంటే కొత్తగా ఏర్పడిన క్షిపణి రక్షణ కూటమిపై రష్యా తీవ్ర విమర్శలు చేసింది. ఇది యుద్ధోన్మాదుల కూటమి అని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఆరోపించారు. రష్యాను వ్యూహాత్మకంగా ఓడించవచ్చనే భ్రమలో కొన్ని దేశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

డ్రోన్ల దాడులపై పరస్పర ఆరోపణలు

అజోవ్ సముద్రంలో జూలై 6 నుంచి 13 మధ్య 105 రష్యా నౌకలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. మరోవైపు మాస్కోపై 300కుపైగా డ్రోన్లను ఉక్రెయిన్ ప్రయోగించిందని రష్యా అధికారులు ఆరోపించారు. ఉక్రెయిన్ మాత్రం రష్యా తమపై 134 దీర్ఘశ్రేణి డ్రోన్లు, మూడు క్షిపణులతో దాడి చేసిందని పేర్కొంది.

గాజా పునర్నిర్మాణానికి రూ.9 వేల కోట్ల సాయం

65 దేశాలు, అంతర్జాతీయ సంస్థలతో ఈయూ సమన్వయం

బ్రస్సెల్స్: యుద్ధంతో తీవ్రంగా దెబ్బతిన్న గాజా ప్రాంత పునరుద్ధరణకు భారీ ఆర్థిక సహాయం అందించేందుకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) ముందుకొచ్చింది. గాజా పునర్నిర్మాణ నిధి కోసం 90 కోట్ల యూరోలు (సుమారు రూ.9 వేల కోట్లు) సమీకరించేందుకు 65 దేశాలు, అంతర్జాతీయ సంస్థలతో కలిసి ఈయూ ప్రయత్నాలు ప్రారంభించింది. పాలస్తీనా దాతల బృందం సమావేశం సోమవారం బ్రస్సెల్స్‌లో జరిగింది. ఈ సమావేశం అనంతరం ఈయూ విదేశాంగ విభాగం ఉన్నత ప్రతినిధి కాజా కల్లాస్ నిధుల సమీకరణ ప్రణాళికను ప్రకటించారు. అమెరికా అధ్యక్ష కార్యాలయం (వైట్‌హౌస్), ఐక్యరాజ్యసమితి సహా పలు దేశాలు, సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా ఉన్నాయని తెలిపారు. దాదాపు 20 లక్షల మంది నివసించే గాజా ప్రాంతం యుద్ధం కారణంగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పారిశుద్ధ్య వ్యవస్థల పునరుద్ధరణ, వ్యవసాయ రంగ అభివృద్ధి, ప్రజల జీవనోపాధి మెరుగుదల వంటి కార్యక్రమాలకు ఈ నిధులను వినియోగించనున్నారు. పాలస్తీనా ప్రజలకు ఈయూ అత్యంత విశ్వసనీయ మద్దతుదారుగా ఉందని కాజా కల్లాస్ పేర్కొన్నారు. గాజా పునర్నిర్మాణానికి అంతర్జాతీయ సహకారం పెంచేందుకు టీమ్ గాజా ఇనిషియేటివ్ కింద ఈ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

ప్రజానావ, సిరిసిల్ల : ఏడాది నుంచి 19 ఏండ్లలోపు వయసు పిల్లలు, విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగాతంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక పాఠశాలలో సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఒక విద్యార్థిని జిల్లా కలెక్టర్ డ్రాయింగ్ వేయగా, ఆ విద్యార్థినిని సన్మానించి.. అభినందించారు. అనంతరం స్కూల్ ఆవరణలోని అంగన్వాడీ కేంద్రంలో పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. కోడి గుడ్లు, పోషకాహారం ఇస్తున్నారా అని ఆరా తీశారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యాలయంలోని ఆట వస్తువులు, బాలామృతం ప్యాకెట్లు పరిశీలించారు. ఆట వస్తువులు వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అంగన్వాడీ ఆవరణను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాదికి రెండు సార్లు మాత్రలు వేస్తారని తెలిపారు. నులి పురుగుల నియంత్రణ కోసం మాత్రలు వేయాలని సూచించారు. దీంతో పిల్లలు వివిధ అనారోగ్య సమస్యల నుంచి బయట పడతారని తెలిపారు. అన్నం తినకముందు, తిన్న తర్వాత చేతులు కడుక్కోవాలని పేర్కొన్నారు. కూరగాయలు, పండ్లు శుభ్రం చేసిన తర్వాత వినియోగించాలని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. జిల్లాలో మొత్తం 1,33,695 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించాల్సి ఉండగా, నేటి కార్యక్రమంలో 1,26,465 మంది పిల్లలకు విజయవంతంగా మాత్రలు పంపిణీ చేయబడినట్లు అధికారులు తెలిపారు. ఇంకా 7,230 మంది పిల్లలకు మాత్రలు అందించాల్సి ఉండగా, వారికి 2026 జూలై 20న నిర్వహించనున్న మాప్–అప్ డే సందర్భంగా తప్పనిసరిగా మాత్రలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రమేష్, సర్పంచ్ పొన్నం లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ముందుకు

- మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు

ప్రజానావ, పెద్దపల్లి : విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పెద్దపల్లి మండలంలోని హనుమంతుని పేట, మారేడు గొండ, మూలసాల, గుర్రంపల్లి గ్రామాల్లో డిఎంఎఫ్ టి నిధులు రూ.1.18 కోట్ల వ్యయం తో ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, రిపేర్లు, టాయిలెట్స్, కిచెన్ షెడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే విజయ రమణారావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని పలు గ్రామాల్లో రూ.5.70 కోట్ల నిధులు స్కూళ్లలో మౌలిక సదుపాయాల నిర్మాణానికి మంజూరు పొందినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. మధ్యాహ్న భోజనంతోపాటు ఉదయం అల్పాహారం అందించడం జరుగుతోందని అన్నారు. నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎస్ఎస్సీ ఫలితాల్లో గత సంవత్సరం రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లా అగ్రభాగాన నిలవడం అభినందనీయ మని చెప్పారు. ఇందులో పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి మండలం ముందు ఉన్నదని అన్నారు. ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, విద్యాశాఖ అధికారులు అంకితభావంతో విధులు నిర్వహించడం వల్లనే ప్రభుత్వ బడులలో మంచి ఫలితాలు వస్తున్నాయని అభినందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలకులు పెద్దపల్లి నియోజకవర్గం లోని ప్రభుత్వ స్కూల్స్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. తమ సొంత ప్రైవేట్ విద్యాసంస్థల అభివృద్ధిని పెంచుకునేందుకు ప్రభుత్వ స్కూల్స్ అభివృద్ధిని అడ్డుకున్నారని చెప్పారు. హనుమంతుని పేట పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 200 మందికి పెరిగిందన్నారు. ప్రభుత్వ స్కూల్స్ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో స్కూల్స్ లలో టీచర్లు విద్యార్థుల సంఖ్యను పెంచే దుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మాల్లో సర్పంచులు మేడగొని శ్రీనివాస్, గుర్రం దేవేంద్ర నాగరాజు, సంపత్, కనపర్తి సంపత్ రావు కాంగ్రెస్ నాయకులు కటుకూరి సుధాకర్ రెడ్డి, మాదిరెడ్డి నరసింహారెడ్డి, బండారి రామ్మూర్తి, మండల సత్యనారాయణ రెడ్డి, ఆర్కుటి సంతోష్ ఆడెపు వెంకటేశం, గన్నమనేని తిరుపతిరావు, యనగందుల ప్రదీప్, ముత్యాల నరేష్, సుధాకర్ రెడ్డి, వెంకటేష్, రాజేశం, జూపాక శ్వేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు,ప్రజలు పాల్గొన్నారు.

వేములవాడ రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

- ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

ప్రజానావ, వేములవాడ : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించా రు. శైవ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు, వేదపండితులు శ్రీ స్వామివారికి మహన్యా స పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతా ర్చనలు, అనంతరం సదస్యం ఏకాంతముగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, సమృద్ధి కోసం ప్రత్యేక పూజలు చేశారు. ఆరుద్ర నక్షత్రం పరమశివునికి అత్యంత ప్రీతికరమైన నక్షత్రంగా, జన్మ నక్షత్రంగా భావిస్తారు. ఈ రోజున మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రపారాయణం, శివార్చన నిర్వహిస్తే ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సకల శుభఫలితాలు లభిస్తాయని శైవాగమ శాస్త్రాలు పేర్కొంటున్నాయి. సోమవారం, ఆరుద్ర నక్షత్రం, చతుర్థశి ఒకే రోజు రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తరించారు. ఇదిలా ఉండగా, శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అను బంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో కూడా సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామి వారికి 266 అభిషేకాలు నిర్వహించగా, 3,509 మంది భక్తులు కోడె మొక్కులు సమర్పించారు. ముఖ్యంగా ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అభిషేక సేవలకు అపూర్వ స్పందన లభించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకే రోజులో 266 అభిషేక టికెట్లు నమోదవడం విశేషంగా నిలిచింది. ఇది శ్రీ భీమేశ్వర స్వామివారిపై భక్తులకున్న అపారమైన విశ్వాసానికి నిదర్శనంగా ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ఆరుద్ర నక్షత్రం, సోమవారం యోగం సందర్భంగా వేములవాడ క్షేత్రం శివనామస్మరణతో మారుమోగగా, భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి ఆనందంగా తిరుగు ప్రయాణమయ్యారు.

బ్రిటన్‌లో ఉగ్రకుట్ర భగ్నం..

12 మంది అరెస్టు

- ఇస్లామిక్ మతసభపై దాడి కుట్రను అడ్డుకున్న పోలీసులు
- భద్రతా కారణాలతో ముందుగానే ముగిసిన యూకే ఇజ్తిమా కార్యక్రమం

లండన్: బ్రిటన్‌లో ఇస్లామిక్ మతపరమైన భారీ కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రదాడికి కుట్ర పన్నినట్లు అందిన విశ్వసనీయ నిఘా సమాచారంతో ఉగ్రవాద నిరోధక పోలీసులు (సీటీపీ) అప్రమత్తమై కీలక చర్యలు చేపట్టారు. ఈ కేసులో మొత్తం 12 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. సఫోక్‌లోని బార్హామ్ సమీపంలోని ష్రబ్‌లాండ్ హాల్‌లో నిర్వహిస్తున్న యూకే ఇజ్తిమా వార్షిక మతసభపై ఉగ్ర ముప్పు ఉన్నట్లు సమాచారం అందడంతో, సోమవారం వరకు జరగాల్సిన కార్యక్రమాన్ని ఆదివారమే ముందుగానే ముగించారు. సుమారు 15 వేల మంది పాల్గొన్న ఈ సభను నిర్వాహకులు పోలీసుల సూచనల మేరకు సురక్షితంగా నిలిపివేశారు. ఈ ఘటనపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు, నిర్వాహకులు సకాలంలో స్పందించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంటూ, ముస్లిం సమాజంపై దాడులు, ద్వేషపూరిత చర్యలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. హోంమంత్రి షబానా మహ్మూద్ కూడా పోలీసుల అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పిందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాద నిరోధక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనిమిది మందిని ఉగ్రవాద నిరోధక చట్టం–2000 కింద అరెస్టు చేశారు. మరో ముగ్గురిని హత్యకు కుట్ర పన్నిన ఆరోపణలపై, ఒక మహిళను నేరస్థుడికి సహకరించిన అభియోగాలతో అదుపులోకి తీసుకున్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
☎ 9948433277, 9014966169



గ్రామాల అభివృద్ధి పట్టని పాలకులు!

EDITORIAL

> మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం అంతా బోగస్. ఎక్కడా చెరువుల పునరుద్దరణ జరగ లేదు. జరిగితే ఇవాళ చెరువుల్లో నీటి చుక్కడా లేకుండా పోదు. వర్షాలు వెనక్కి పోవడంతో గ్రామాల్లో మంచినీటి సమస్యల తరుముకు వస్తోంది. పట్టణాల్లో ఇప్పుడిప్పుడే మళ్లీ ట్యాంకర్లు తిరుగుతున్నాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం వల్ల భూగకభ జలాలు వట్టి పోయాయి. తాత్కాలిక చర్యలతో ప్రభుత్వాలు ఏళ్లుగా కాలయాపన చేస్తూ వచ్చాయి. ఈ క్రమంలో ఏళ్లుగా గ్రామాలు కునారిల్లుతున్నాయి. కనీస వసతులు లేవు. గ్రామాల అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి అంతా కలసి రావాలి.

పల్లె కన్నీరు పెడుతోంది. మంచినీటి కోసం కన్నీరు పెడుతోంది. సాగునీటి కోసం రైతన్న కన్నీరు పెడుతున్నాడు. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరించామన్న పెద్దమనుషులు గ్రామాలకు వస్తే.. చెరువులు ఎలా ఉన్నయో కనిపిస్తాయి. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం అంతా బోగస్. ఎక్కడా చెరువుల పునరుద్ధరణ జరగ లేదు. జరిగితే ఇవాళ చెరువుల్లో నీటి చుక్కడా లేకుండా పోదు. వర్షాలు వెనక్కి పోవడంతో గ్రామాల్లో మంచినీటి సమస్యల తరుముకు వస్తోంది. పట్టణాల్లో ఇప్పుడిప్పుడే మళ్లీ ట్యాంకర్లు తిరుగుతున్నాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం వల్ల భూగకభ జలాలు వట్టి పోయాయి. తాత్కాలిక చర్యలతో ప్రభుత్వాలు ఏళ్లుగా కాలయాపన చేస్తూ వచ్చాయి. ఈ క్రమంలో ఏళ్లుగా గ్రామాలు కునారిల్లుతున్నాయి. కనీస వసతులు లేవు. గ్రామాల అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. అమరావతి పేరుతో ఎపిలో గ్రామాలను పట్టించు కోవడం లేదు. బలవంతంగా రైతుల నుంచి భూములు లాక్కుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పంటలు వేసుకున్న పొలాలను జెసిబిలతో దున్నుతూ రైతులను వీధుల్లో పడేస్తున్నారు. వారికి గౌరవప్రదమైన పరిహారం కూడా చెల్లించడం లేదు. చంద్రబాబు నిరంకుశ విధానాలకు ఇది పరాకాష్టగా నిలుస్తోంది. తెలంగాణో ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుద్దరణ వంటి వాటికి ఇస్తున్న ప్రాధాన్యం గ్రామాలకు దక్కడం లేదు. దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ప్లాస్టిక్ భూతంలా వెన్నాడుతోంది. పర్యావరణం దెబ్బతింటోంది. మొక్కలు నాటడం లేదు. కోతులను తరమడం లేదు. భూగర్భ జలాలను పెంచే ప్రయత్నాలు సాగడం లేదు. ఈ సమస్యలన్నీ పరిష్కరించలేని వేవూ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. ప్రజల భాగస్వామ్యంతోనే ఇవన్నీ సాధ్యం. అలాగే ప్రజలను బాధ్యులుగా డా చేయాలి. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు బాధ్యులను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను పురోగించేలా చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపతేం చేస్తూ పోవాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత డా తగ్గుతుంది. వ్యవసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాణ అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. ఎందుకంటే రోడ్డురవాణాను విస్తరిస్తే గ్రామాలు వాటంతటఅవే పురోగమిస్తాయి. గ్రావుణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గుతంది. పదిశాతం దృష్టి గ్రామాలపై పెట్టినా అవి అల్లుకు పోతాయి. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పటు గ్రామాలు పురోగమిస్తాయి. చైనా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోటీపడటం... తప్పు లేదు. అందుకు తగ్గట్లుగా గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయగలిగితేనే ఇది సాధ్యం అవుతుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయ రంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి ంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని స్థానిక వనరులను ఉపయోగించుకుంటే అభివృద్ధికి దోహదపడగలదు. చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఓవైపు రాష్ట్రమంతటా ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. అప్పుడప్పుడు మబ్బులే తప్ప వానలు పడటం లేదు. ఒక్కోరోజు వాతావరణం ఎండాకాలాన్ని తలపి స్తున్నది. పంటలు సాగు చేసేందుకు రైతులు వెనుకాడుతున్న పరిస్థితి కనపడుతోంది.

> మనం వ్యవసాయ రంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానం గా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి ంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని స్థానిక వనరులను ఉపయోగించుకుంటే అభివృద్ధికి దోహదపడగలదు.

శిథిలావస్థలో 'ఘణపురం' ఎస్సీ హాస్టల్!

- 55 ఏళ్ల పాత భవనంలోనే విద్యార్థుల అవస్థలు
- నూతన భవనం నిర్మించాలని కలెక్టర్‌కు ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ వినతి

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో: ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. దాదాపు 55 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పాత భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనల మధ్య కాలం వెల్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలో, హాస్టల్‌కు తక్షణమే నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ప్రతినిధులు సోమవారం వనపర్తి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎనిమిదేళ్లుగా అరణ్య రోదనే..

హాస్టల్‌కు నూతన భవనాన్ని మంజూరు చేయాలని గత ఎనిమిదేళ్లుగా వార్డెన్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మౌలిక వసతులైన మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేక విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని మండిపడ్డారు.

మా చదువులు నాగర్‌కర్నూల్‌లో..

బతుకులు వనపర్తిలోనా?

- రవాణా లేక.. రైతన్నలకు గోస
- వనపర్తి జిల్లాతో తల్నూనూర్ ప్రజల తంటాలు!
- జిల్లా మార్పుతో యువతకు ఉపాధి కరవు.. విద్య, వైద్యానికి దూరం!
- తిరిగి పాత జిల్లాలో కలిపే దాకా వెనక్కి తగ్గేదే లే.. తల్నూనూర్ హెచ్చరిక!

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో: మా చదువులన్నీ నాగర్‌కర్నూల్ జిల్లాలో.. మా బతుకులేమో వనపర్తి జిల్లాలోనా? ఇదెక్కడి న్యాయం.? అంటూ తల్నునూర్ గ్రామ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాన్ని వనపర్తి జిల్లా నుండి తొలగించి, తిరిగి నాగర్‌కర్నూల్ జిల్లాలోనే కలపాలనే ప్రధాన డిమాండ్‌తో అఖిలపక్షం ఆధ్వర్యంలో గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రజల పరిపాలనా సౌలభ్యం కోసమే ఈ న్యాయమైన పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు.

దూరభారం – రవాణా కష్టాలు

తల్నునూర్ గ్రామం నుండి వనపర్తి జిల్లా కేంద్రం 30 కిలోమీటర్ల దూరంలో ఉండగా, నాగర్‌కర్నూల్ కేవలం 14 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. జిల్లాకు, మండలానికి వెళ్లడానికి కనీసం బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో, ఆటోలు కూడా వెళ్లని దారుణమైన పరిస్థితి.

విద్య, వైద్యానికి దూరం

విద్యా, వైద్య అవసరాల కోసం వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లడం గ్రామ ప్రజలకు, విద్యార్థులకు పెను భారంగా మారింది. గతంలో తల్నునూర్ గ్రామం నాగర్‌కర్నూల్‌లోనే ఉండటంతో అందరికీ విద్యా, వైద్య సదుపాయాలు సులువుగా అందేవి.

రైతన్నల గోస:

తల్నునూర్ గ్రామ రైతులు తాము పండించిన పంటను నాగర్‌కర్నూల్ జిల్లాలోనే అమ్ముకుంటున్నారు. అంతేకాకుండా, వ్యవసాయానికి కావలసిన ఎరువులు, విత్తనాలు కూడా నాగర్‌కర్నూల్ జిల్లాలోని దుకాణాల నుంచే తెచ్చుకుంటున్నారు. జిల్లా మారడం వల్ల సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడంలో తీవ్ర సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

యువతకు ఉపాధి ఇబ్బందులు

జిల్లా మార్పు వల్ల స్థానిక యువత కు ఉద్యోగ, ఉపాధి అవకాశాల పరంగా కూడా తీవ్ర అన్యాయం జరుగుతోందని గ్రామ యువకులు ఆవేదన చెందుతున్నారు.

వెనక్కి తగ్గని పోరాటం!

గతంలో మా గ్రామం నాగర్‌కర్నూల్ జిల్లాలోనే ఉంది. పరిపాలనా సౌలభ్యం కోసం తిరిగి మా గ్రామాన్ని పాత జిల్లాలోనే కలపాల్సిందే. అప్పటివరకు మా పోరాటం ఆగదని తల్నునూర్ గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు తెగేసి చెప్పారు. ప్రభుత్వం, ఉన్నతాధికారు లు తక్షణమే స్పందించి, తమ భౌగోళిక, రవాణా ఇబ్బందులను గుర్తించి తల్నునూర్ గ్రామాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి

- సీజనల్ వ్యాధుల నివారణ, నాణ్యమైన భోజనం, వనమహోత్సవ లక్ష్యాలపై అధికారులకు కలెక్టర్ హైమావతి ఆదేశాలు

ప్రజానావ, సిద్దిపేట: జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ప్రగతి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ఆమె సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, హాస్టళ్ల పరిసరాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటిస్తూ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం లేకుండా చూడాలని, వారానికి కనీసం ఒకసారి ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. శానిటేషన్ డ్రైవ్‌ను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు స్పెషల్ ఆఫీసర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు హాస్టళ్లు, పాఠశాలల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వనమహోత్సవంలో ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగి ఒక మొక్క నాటేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. అలాగే విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ప్రకృతి పరిరక్షణ, పోషకాహారంపై అవగాహన పెంపొందించాలని సూచించారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్ అందేలా ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహించాలని, విద్యార్థులకు యూనిఫాంలు సకాలంలో అందేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవ్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిరంజన్‌రెడ్డి పరామర్శ

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో: నాగపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కార్వంగ పాపులు తండ్రి ముత్యాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. వారిని ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఓటర్ల జాబితా ప్రత్యేక ముసాయిదా సవరణ ప్రక్రియలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విధిగా పాల్గొనాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్‌ఓలు, బీఆర్ఎస్ శ్రేణులు దగ్గరుండి ఓటరు నమోదు పత్రాలను తప్పుల్లేకుండా పూరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం శివరాం రెడ్డి, గౌరీదేవిపల్లి సర్పంచ్ సురేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ వెంకటేష్, నెంబర్ ఖాజా, నరహరి, ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే అభినందనలు

ప్రజానావ, యాదాద్రి భువనగిరి: నూతనంగా ఎన్నికైన భువనగిరి చేనేత సహకార సంఘం పాలకవర్గ సభ్యులు సోమవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘం బలోపేతంపై సభ్యులు ఎమ్మెల్యేతో చర్చించారు. చేనేత రంగ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఏలే సుధాకర్, కార్యదర్శి గర్దాసు చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు తిరందాసు దానయ్యతో పాటు ఇతర పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డీఈఓను సస్పెండ్ చేయాలి

- డీఈఓ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల నిరసన
- ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు



ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో: జిల్లాలో విద్యాశాఖ పరిపాలన పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, ప్రైవేట్ పాఠశాలల అక్రమాలు, కేజీబీవీల్లోని సమస్యలను పట్టించుకోవడంలో విఫలమైన జిల్లా విద్యాధికారి (డీఈఓ)ను వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎంఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, యూఐఎస్ఎఫ్, బీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రెండేళ్లుగా అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా, ఈ ఏడాది దానికి అనుమతులు ఇవ్వడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా పుస్తకాల విక్రయాలు సాగుతున్నా అధికారులు మద్దతు తెలుపు తున్నారని ఆరోపించారు. ఇటీవల నాగనూలు కేజీబీవీలో పురుగుల అన్నం పెడుతున్నా డీఈఓ స్పందించలేదని, తిమ్మాజిపేట కేజీబీవీలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొని బదిలీ అయిన ప్రత్యేక అధికారి సుజాతే ఇప్పటికీ అక్కడి పరిపాలనను శాసిస్తున్నా చర్యలు లేవన్నారు. విధుల్లో ఉన్న ఉద్యోగిని ఆన్‌లైన్‌లో మరణించినట్లు చూపినా విచారణ జరపకపోవడం విచారకరమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై, కేజీబీవీల లోపాలపై సమగ్ర విచారణ జరిపి డీఈఓపై చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్ కుమార్, బుక్కాపురం మహేష్, సాయిబాబు, సయ్యద్, దేగ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 'హ్యామ్' రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా రోడ్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక రహదారుల అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపనలు చేశారు. మహబూబ్ నగర్ జిల్లా ప్యాకేజ్–1లో భాగంగా రూ.573 కోట్ల వ్యయంతో చేపట్టే పనులను మక్తల్ నియోజకవర్గంలో ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.237 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న మక్తల్–నారాయణ పేట నాలుగు లైన్ల హ్యామ్ రోడ్డు పనులకు మంత్రులు శంకుస్థాపన చేసి, పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని విస్మరించిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రవాణా కష్టాలు తీర్చేందుకు ఈ భారీ ప్రాజెక్టును మంజూరు చేసిందని తెలిపారు. అదేవిధంగా వనపర్తి జిల్లాలో రూ.359.09 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 171.96 కి.మీ పొడవు గల హ్యామ్ రోడ్డు పనులకు, జోగులాం బ గద్వాల జిల్లా ధరూర్ మండలంలో రూ.339.39 కోట్లతో చేపట్టనున్న గద్వాల– రాయచూర్ మహబూబ్‌నగర్–2 ప్యాకేజీ రహదారి పనులకు మంత్రులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, తూడి మేఘారెడ్డి, జి. మధుసూదన్ రెడ్డి, కసిరెడ్డి నారా యణరెడ్డి, కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, కలెక్టర్లు ప్రియాంక, ఆదర్శ్ సురభి, ఎస్పీలు డాక్టర్ వినీత్, సునీతారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

వనపర్తి డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో: మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, యువత తమ జీవిత లక్ష్యాలపై దృష్టి సారించినప్పుడే ఆరోగ్యవంతమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని వనపర్తి డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో డ్రగ్స్ నిర్మూలన, విద్యార్థినుల భద్రతపై సోమవారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఒకసారి వ్యసనాలకు బానిసైతే విద్య, ఆరోగ్యం, జీవిత లక్ష్యాలన్నీ దెబ్బతింటాయన్నారు. అంతకుముందు నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన సుమారు 400 మంది విద్యార్థులకు యాంటీ డ్రగ్ సోల్జర్ సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సర్టిఫికెట్ సాధించిన ప్రతి విద్యార్థి సమాజంలో చైతన్యం తెచ్చేందుకు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, సైబర్ వేధింపులు ఎదురైతే భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని, 1908 టోల్ ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అంజాద్, కళాశాల ప్రిన్సిపాల్ నవీన, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

EAGLE FORCE TELANGANA
CHILD SAFETY, ANTI DRUG DRIVE
1908
STAND WITH HER

భీమేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

ప్రజానావ, వేములవాడ : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని గౌరవ తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు శ్రీ ఆది శ్రీనివాస్ గారు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీ ఆది శ్రీనివాస్ గారికి ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో, స్వస్తివాచనంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యేకు ఆలయ మండపంలో అర్చకులు తీర్థప్రసాదం అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శ్రీమతి ఎల్. రమాదేవి గారు స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని శ్రీ ఆది శ్రీనివాస్ గారికి అందజేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడుకోవాలి

- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు
- కాంగ్రెస్ పార్టీ హెల్ప్ డెస్క్ ఏర్పాటు

S.I.R
హెల్ప్ డెస్క్
పట్టణ కాంగ్రెస్ పార్టీ - సిరిసిల్ల

ప్రజానావ, సిరిసిల్ల : తెలంగాణలో ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు, కొత్త పేర్ల నమోదు, తప్పుల సవరణ కోసం బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓ) నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు పిలుపు నిచ్చారు. సోమవారం సిరిసిల్లలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ సందర్భంగా సమావేశంలో సూర దేవరాజు మాట్లాడుతూ... ప్రతి మనిషికి ఓటు హక్కు అనేది ఎంతో కీలకమైందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బూత్ లెవెల్ అధికారులకు ప్రజలు సరైన సమాచారం అందించి, ఓటర్ జాబితాలో తమ వివరాలు తప్పులు లేకుండా సరిగ్గా ఉన్నాయో లేదో స్వయంగా సరిచూసుకోవాలని సూచించారు.

ప్రతి బూత్‌లో కాంగ్రెస్ హెల్ప్ డెస్క్

ఓటర్లకు అవగాహన కల్పించేందుకు, అలాగే నమోదు ప్రక్రియలో సహాయం చేయడానికి సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద హెల్ప్ డెస్క్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు దేవరాజు ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బూత్ సూపర్‌వైజర్ బొప్ప దేవయ్య, కౌన్సిలర్ లింగంపల్లి రాజు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రమేష్, శ్రావణ్, సబ్బని వేణు, ఇప్పపుల లక్ష్మణ్, బాలరాజు, నాగభూషణం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్

19న న్యూఢిల్లీలో ప్రధానం

ప్రజానావ, కరీంనగర్ : రాష్ట్రంలో పాలు ఉత్పత్తి చేసే రైతుల సాధికారత కోసం చేసిన విశేష సేవలకు గుర్తింపుగా, కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ చలిమెడ రాజేశ్వరరావుకు యూఎస్ఏ మేరీల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. జూలై 19న న్యూఢిల్లీలోని లోధి రోడ్‌లో ఉన్న ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లోని గుల్మోహర్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. వ్యవసాయ పట్టభద్రులైన రాజేశ్వరరావు పాడి పరిశ్రమ రంగంలోనూ, రైతుల సాధికారత దిశగానూ అవిశ్రాంత కృషి చేశారు. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అదనపు ఆదాయ వనరుగా చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. రాజేశ్వరరావు నాయకత్వంలో కరీంనగర్ డెయిరీ అద్భుతమైన వృద్ధిని సాధించి, పాలు,పాల ఉత్పత్తుల సేకరణ, అమ్మకాల పరంగా తెలంగాణ రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచింది. మార్కెట్ పరిధిని విస్తరించడానికి,రైతుల ఆదాయాన్ని పెంచడానికి దోహదపడేలా ఆయన అనేక కొత్త ఉత్పత్తుల తయారీకి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం లక్ష మందికి పైగా రైతులు కరీంనగర్ డెయిరీకి పాలను సరఫరా చేస్తున్నారు ఈ ప్రాంతంలో పాల ఉత్పత్తిని పెంచేందుకు, రైతులు మరియు పాడి పశువుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను ప్రారంభించడంలో రావు కీలక పాత్ర పోషించారు. 1971లో 12,000 లీటర్ల సామర్థ్యంతో ప్రారంభమైన డెయిరీ, నేడు తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలోని మెగా డెయిరీ కేంద్రంతో కలిపి 3 లక్షల లీటర్లకు పైగా సామర్థ్యానికి విస్తరించింది. 2020లో ఉత్తమ మధ్య తరహా సంస్థగా ఇండియా డెయిరీ అవార్డు, 2019లో డెయిరీ రంగంలో ఉత్తమ రిటైలర్‌గా ది హన్స్ ఇండియా అవార్డు, 2018లో దేశంలోనే ఉత్తమ నాణ్యమైన పాలు మరియు పాల ఉత్పత్తులకు గాను ఇండియన్ అగ్రికల్చర్ అవార్డు, 2017లో ఉత్తమ పారిశ్రామికవేత్తగా కరీంనగర్ లయన్స్ క్లబ్ అవార్డు, 2014లో ఉత్తమ సామాజిక సేవకు గాను ఒంగోలులోని ఆచార్య ఎన్.జి. రంగా కిసాన్ సంస్థ అవార్డు, 2016లో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి వారి ఉత్తమ రైతు అవార్డు, 2010లో ఉత్తమ సేవల విభాగంలో డాక్టర్ సి. కృష్ణారావు అవార్డులను రాజేశ్వరరావు అందుకున్నారు.

భూముల రీసర్వేను పటిష్టంగా నిర్వహించాలి

- జీపీఓలు, జూనియర్ రికార్డ్ అసిస్టెంట్లకు 10 రోజుల శిక్షణ
- హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి

ప్రజానావ, హనుమకొండ: గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వే ప్రక్రియను పటిష్టంగా నిర్వహించి, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ మండలం పలివేల్పుల రైతు వేదికలో భూముల కొలతల శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎంపిక చేసిన జీపీఓలు, జూనియర్ రికార్డ్ అసిస్టెంట్లకు భూముల రీసర్వేపై 10 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్లు నిర్వహిస్తున్న రీసర్వేకు జీపీఓలు, జూనియర్ రికార్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో సహకరించాలని సూచించారు. రీసర్వే ప్రక్రియ పారదర్శకంగా, వివాదరహితంగా జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. శిక్షణలో పాల్గొన్న 79 మంది జీపీఓలు, జూనియర్ రికార్డ్ అసిస్టెంట్లకు భూముల కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, డీఐ సారంగపాణి, సర్వేయర్ సురేందర్ రీసర్వే విధానాలు, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్వేయర్లు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వేములవాడ రాజన్న ఆలయంలో సీతా శిక్షణ ప్రారంభం

- ఆలయ సంస్కృతి – శైవాగమం – పరిపాలనపై మూడు రోజుల ప్రత్యేక కార్యక్రమం

ప్రజానావ, వేములవాడ : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన **స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (సీతా)** ఆధ్వర్యంలో మూడు రోజుల **ఆలయ సంస్కృతి–శైవాగమం–పరిపాలన** శిక్షణ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. జూలై 13 నుంచి 15 వరకు నిర్వహించనున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని సీతా డైరెక్టర్ డా. చిలకపాటి విజయ రాఘవాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ నియమ నిబంధనలు, ఉద్యోగుల విధులు, బాధ్యతలు, క్రమశిక్షణ, ఆలయ పరిపాలనలో అనుసరించాల్సిన విధానాలపై వివరించారు. అలాగే శైవాగమ శాస్త్రాల ప్రాముఖ్యత, ఆలయ సంప్రదాయాలు, ఆగమ విధానాల ప్రకారం పూజలు, ఆలయ నిర్వహణ విశిష్టతను వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో 15 ఏళ్లకు పైగా పనిచేసిన అనుభవంతో ఆలయ పరిపాలనలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలను ఉద్యోగులతో పంచుకున్నారు.

తొలి రోజు శిక్షణ విశేషాలు..

ఉదయం నమోదు, పరిచయ కార్యక్రమం అనంతరం శ్రీశైలం దేవస్థానానికి చెందిన శ్రీ కె.వి. సత్య బ్రహ్మాచార్యులు టెంపుల్ కల్చర్–శైవాగమం సిద్ధాంతం, ఆచరణ అంశంపై శిక్షణ ఇచ్చారు. శైవాగమ సిద్ధాంతాలు, ఆలయ సంస్కృతి, ఆగమ శాస్త్రాల ప్రాముఖ్యతను వివరించారు. మధ్యాహ్నం టెంపుల్ స్కల్ప్చర్ అంశంపై స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రధాన స్థపతి డి.ఎన్.వి. ప్రసాద్ స్థపతి శిక్షణ అందించారు. ఆలయ నిర్మాణ శిల్పకళ, గర్భగృహ నిర్మాణ విశిష్టత, భారతీయ దేవాలయ వాస్తు సంప్రదాయాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు.

శిక్షణలో ముఖ్యాంశాలు..

✻ ఆలయ సంస్కృతి విశిష్టత
✻ శైవాగమ శాస్త్రాలు
✻ ఉద్యోగుల విధులు, నియమ నిబంధనలు
✻ దేవాదాయ శాఖ జిల్లా కార్యాలయాల మాన్యువల్ (డీఓఎం)
✻ క్రమశిక్షణ చర్యలు
✻ ఆలయ పూజా విధానాలు
✻ ఆలయ నిర్మాణ శాస్త్రం
✻ ఆగమాల సామాజిక ప్రాధాన్యం
✻ టెంపుల్ కల్చర్–ఆగమాలు
✻ టెంపుల్ సోషల్ ఆడిట్

దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఆలయ ఉద్యోగుల్లో సేవాభావం, క్రమశిక్షణ, పరిపాలనా నైపుణ్యాలను పెంపొందించి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎన్. సుప్రియ, డిప్యూటీ ఈవో నవీన్ కుమార్, ఈఈ రాజేష్, ఆలయ అర్చకులు, వేద పండితులు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, ఐఏఎస్ మార్గదర్శకత్వంలో, ధార్మిక సలహాదారు ఆర్. గోవింద హరి సూచనలతో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఆలయ ఉద్యోగుల నైపుణ్యాలను పెంపొందించి, ఆగమశాస్త్రాలపై సమగ్ర అవగాహన కల్పించి, ఆలయ సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

టామ్ టామ్ సంస్థ ద్వారా ఐటీఐ విద్యార్థులకు

శిక్షణ, ఉద్యోగ అవకాశాల కల్పన

- కేటీఆర్ హరీష్‌లు నిత్యం ప్రచారం కోసం పోటీ పడుతున్నారు
- కవిత చెప్పిన రూ. 1400 కోట్ల పార్టీ పండు ఎక్కడిదో నోరు విప్పాలి
- సిరిసిల్లలో 3500 ఇండ్లకు 2500 ఇప్పటికే పూర్తి చేశాం, ఓట్ల కోసమే బీఆర్ఎస్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతో మభ్యపెట్టింది
- సిరిసిల్లలో మైనింగ్, కార్మిక ఉపాధి కల్పన శాఖా మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రజానావ, సిరిసిల్ల : ఐటీఐ శిక్షణలో ఉన్నవారికి జర్మనీ టామ్ టామ్ సంస్థ ద్వారా , సిరిసిల్ల నుండి 100 మంది వరకు శిక్షణతో పాటు ఉద్యోగాలు కల్పించనున్నట్టు రాష్ట్ర మైనింగ్ కార్మిక ఉపాధి శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. సోమవారం సిరిసిల్లలో మాల మహానాడు నాయకుడు రాగుల రాములు కూతురు వివాహానికి హాజరైన సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత కేసీఆర్ ఫామ్ హౌస్ నుండి మనుమడి కోసం బయటకు వచ్చారని అన్నారు. తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలపై మాట్లాడాలని చాలాసార్లు కోరారని అన్నారు. ప్రతి పక్ష లీడర్ గా ఉన్న కేసీఆర్ ఏనాడు ఒక్క మాట కూడా ప్రజా సమస్యలపై మాట్లాడలేదన్నారు. కేటీఆర్, హరీష్ ఇద్దరు కాళేశ్వరం నీటిని పంపు చేయాలని అంటున్నారని, పంపు చేయగలిగితే బ్యారేజ్ లు ఎందుకు కట్టారని ప్రశ్నించారు. కేసీఆర్ ఇంజనీర్ కాదని, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్ డి ఎస్ ఎ) సెంట్రల్ కమిటీ ఏమీ చేయకూడదని నివేదిక ఇచ్చిందని, మీరు ఢిల్లీకి వెళ్ళి అనుమతి తీసుకొని రండి అని ఈ సందర్భంగా సూచించారు. కేటీఆర్, హరీష్ రావు లు నిత్యం, రాత్రింబవళ్లు పబ్లిసిటీ కోసం పాకులాడుతూ పోటీ పడుతున్నారని మంత్రి ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి రూ.1400 కోట్లు పండు ఎక్కడి నుండి వచ్చాయని కవిత అడుగుతున్నదని, దీనిపై ప్రజలకు వీరు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. పది సంవత్సరాలుగా కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు, కమీషన్ ల పరిపాలన సాగించిందన్నారు. ఎల్ నినో ప్రభావం తో వర్షాలు పడడం లేదని, ఎలా చేద్దాం అనే ఆలోచనతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల లో 3500 ఇళ్లలో 2500 ఇళ్లు కట్టడం జరిగిందని, బీఆర్ఎస్ హాయంలో ఓట్ల కోసం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని కాలం వెల్లదీశారని అన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు నాగుల సత్యనారాయణ గౌడ్, పిసిసి మాజీ కార్యదర్శి గడ్డం నరసయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, మున్సిపల్ కౌన్సిలర్ బొద్దుల శ్రీనివాస్, ఎల్లె లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్‌కు భిక్కనూర్ విద్యార్థినుల ఎంపిక

హర్యానాలో నిర్వహించే ఎక్స్పోజర్ విజిట్‌లో పాల్గొననున్న శ్రీలక్ష్మి , రిషిక

ప్రజానావ, కామారెడ్డి: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక ఔఏక్ భారత్–శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ–హర్యానా రాష్ట్రాల మధ్య చేపట్టనున్న ఎక్స్పోజర్ విజిట్‌కు భిక్కనూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు **శ్రీలక్ష్మి , రిషిక** ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్ తెలిపారు. జూలై 15 నుంచి 22 వరకు హర్యానా రాష్ట్రంలో నిర్వహించే ఈ విద్యా పర్యటనలో భాగంగా విద్యార్థినులు అక్కడి చారిత్రక ప్రదేశాలు, ప్రముఖ విద్యాసంస్థలు, సాంస్కృతిక కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్నారు. అలాగే హర్యానా రాష్ట్ర ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి, భాష, కళలు, ఆహారపు అలవాట్లు, జీవన విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం వారికి లభించనుంది. ఎంపికైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకుని హర్యానా రాష్ట్ర విశిష్టతలను తెలుసుకోవడంతో పాటు తెలంగాణకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు భవాని, ఉపాధ్యాయ బృందం ఎంపికైన విద్యార్థినులను అభినందించి, వారి పర్యటన విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థినులకు అభినందనలు తెలియజేశారు.

నీళ్ల కోసం రోడెక్కిన మహిళలు

- ధరంపల్లిలో నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా
- ఖాళీ బిందెలతో ఆందోళన

ప్రజానావ, ఆసిఫాబాద్: జిల్లాలోని చింతలమానేపల్లి మండలం ధరంపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. మిషన్ భగీరథ ద్వారా సరఫరా కావాల్సిన తాగునీరు రెండు నెలలుగా అందకపోవడంతో సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చి నిరసన చేపట్టారు. గ్రామంలో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో తాగునీటి కోసం మహిళలు దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రోజువారీ పనులు సైతం ఇబ్బందికరంగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని మహిళలు ఆరోపించారు. ఖాళీ బిందెలను రోడ్డుపై ఉంచి నిరసన వ్యక్తం చేస్తూ గ్రామానికి వెంటనే మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు. గ్రామస్తుల నిరసనతో కొంతసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధరంపల్లి గ్రామ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీఈఐఆర్‌తో విశిష్ట విజయాలు సాధిస్తున్న జిల్లా పోలీసులు

- 76.8 శాతం మొబైల్ రికవరీ రేటుతో రాష్ట్రంలో 3వ సంవత్సరం మొదటి స్థానం
- రూ.13 లక్షల విలువ గల 90 మొబైల్ ఫోన్లు రికవరీ... యజమానులకు అందజేత
- మొబైల్ ఫోన్ పోయిన, చోరికి గురైనా ఎస్ఈఐఆర్ అప్లికేషన్ సద్వినియోగం చేసుకోవాలి
- ఎస్పీ మహేష్ బీ. గీతే

ప్రజానావ, సిరిసిల్ల : జిల్లా పోలీసులు మొబైల్ ఫోన్ రికవరీలో 76.8% శాతం మొబైల్ రికవరీ రేటు సాధించి,రాష్ట్రంలో మూడవ సంవత్సరం ప్రథమ స్థానంలో నిలవడం జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ,సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించిన తీరుకు నిదర్శనమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్ ఫోన్ రికవరీ మేళాలో జిల్లాలో గత కొన్ని రోజుల నుండి పోయిన, చోరీకి గురైన సుమారు రూ.13 లక్షల విలువ గల 90 ఫోన్ల ఆచూకీ మన రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుండి రికవరీ సంబంధిత మొబైల్ ఫోన్ల యజమనులకి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ లేనిదే ఒక చిన్న లావాదేవీ కూడా చేయలేని, మన విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్, పాస్ వర్డ్స్ వంటివి మొబైల్‌లో సేవ్ చేసి పెట్టుకుంటారని తెలిసిన నేరగాళ్లు మొబైల్ దొంగిలించి, వీక్ పాస్ వర్డ్స్ లను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మద్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతుందన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ బ్లాక్ చేసి, సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రజలకు ముఖ్య గమనిక..

సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్ కొనుగోలు చేసే వారు తప్పనిసరిగా సంబంధిత మొబైల్ షాప్ యజమాని నుండి బిల్లు లేదా రసీదు తీసుకోవాలని, తక్కువ ధరకు లభిస్తుందని భావించి, దొంగిలించిన ఫోన్ అని తెలియక కొనుగోలు చేసిన అమాయక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దొంగిలించబడిన మొబైల్ ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మొబైల్ ఫోన్ అమ్మాలనుకునే వారు తప్పని సరిగా సంబంధిత కంపెనీలకు ఎక్స్చేంజ్, విక్రయించాలే తప్ప తెలియని వ్యక్తులకు లేదా అనధికారికంగా మొబైల్ షాపులకు విక్రయించవద్దని, ఇటువంటి మొబైల్ ఫోన్లు సైబర్ నేరాలకు వినియోగించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా జిల్లాలో పోయిన మొబైల్ ఫోన్స్ రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐ.టి కోర్ ఎస్ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ రాజాతిరుమలేష్ లను జిల్లా ఎస్పీ అభినందించారు. పోయిన మొబైల్ ఫోను మళ్లీ దొరకదనుకున్న మొబైల్ ఫోన్ జిల్లా పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంబంధిత బాధితులు జిల్లా ఎస్పీకి, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐ సురేష్, ఐటి కోర్ ఎస్ఐ కిరణ్ కుమార్, ఆర్ఐ యాదగిరి, కానిస్టేబుల్ రాజాతిరుమలేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణికి 202 దరఖాస్తుల రాక

అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజానావ, సిరిసిల్ల : ప్రజావాణికి 202 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 202 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు పంపారు. ప్రజావాణి దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 14 దరఖాస్తులు వచ్చాయి. సిరిసిల్ల ప్రజావాణికి 10, వేములవాడ ప్రజావాణికి 04 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో జడ్పీ సీఈఓ వెంకట మాధవరావు రావు, డీఆర్ఓ జయశ్రీ, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి

- వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష

ప్రజానావ, హనుమకొండ: ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లాలో వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జడ్పీ సీఈవో శేషాద్రి, జీడబ్ల్యూఎంసీ కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, మెప్మా కోఆర్డినేటర్ రజిత రాణి, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంఢర్‌పూర్ వార్కారి యాత్రలో విషాదం

- ముగ్గురు మహిళా యాత్రికులు మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజానావ, ముంబై: పుణె జిల్లా సస్వాడ్–జేజూరి రహదారిపై బెల్సర్ టోల్ ప్లాజా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళా వార్కరీలు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయప డ్డారు. సాంగ్లీ జిల్లా నుంచి పంఢర్‌పూర్ యాత్రకు వెళ్తున్న దిండిని వెంబడిస్తున్న ట్రక్కు అదుపు తప్పి మహిళా యాత్రికులను ఢీకొట్టడంతో ఈ ఘటన జరిగింది. అనారోగ్యంతో ఉన్న డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక సమాచారం. ప్రమాదంలో గాయపడిన వారిని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సునేత్రా పవార్ పరామర్శించి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వార్కరీల భద్రత అందరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

లడఖ్‌లో ఇండిగో ఇంజినీర్ అరెస్టు

- ఏఎన్‌టీఎఫ్ తనిఖీల్లో 2.27 గ్రాముల హెరాయిన్ పట్టివేత
- డ్రగ్స్ ముఠాలతో సంబంధాలపై దర్యాప్తు
- ఈ ఏడాదిలో 33 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు

లేహ్: లడఖ్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కొనసాగుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమాన నిర్వహణ ఇంజినీర్ అజయ్ ఠాకూర్ (22)ను యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ (ఏఎన్‌టీఎఫ్) అధికారులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 2.27 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి జిల్లాకు చెందిన అజయ్ ఠాకూర్ ఆదివారం లేహ్‌లోని అగ్లింగ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీ చేశారు. ఈ సమయంలో పారిపోవడానికి ప్రయత్నించగా అదుపులోకి తీసుకుని సిగరెట్ ప్యాకెట్‌లో దాచిన హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడికి అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠాలతో ఏమైనా సంబంధాలున్నాయా? ఎయిర్‌పోర్టు సిబ్బంది ప్రమేయం ఉందా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఏడాది లడఖ్‌లో ఇప్పటివరకు 33 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదై 27 మంది అరెస్టయ్యారని, భారీ మొత్తంలో చరస్, గంజాయి, హెరాయిన్, బ్రౌన్ షుగర్, కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

రూ.28.80 లక్షల బొగ్గు మళ్లింపు

- వ్యర్థమైన బొగ్గు పేరుతో నాణ్యమైన బొగ్గు విక్రయం
- 720 మెట్రిక్ టన్నుల జీ–12 గ్రేడ్‌గా గుర్తించిన అధికారులు
- కాంట్రాక్టర్, రైల్వే అధికారులపై సీబీఐ కేసు
- ప్రైవేటు సంస్థ యజమానితో పాటు మరికొందరు ఎస్ఈసీఆర్ అధికారులపై ఎఫ్ఐఆర్

COAL QUALITY REPORT
Total Moisture
Ash Content
Volatile Matter
Fixed Carbon
Fixed Carbon
Sulphur
FRAUD
Nagpur Today
kcal/kg

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సమీపంలోని దుమ్రీ ఖుర్ద్ రైల్వే సైడింగ్‌లో రూ.28.80 లక్షల విలువైన బొగ్గు అక్రమంగా మళ్లించిన వ్యవహారంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో ప్రైవేటు కాంట్రాక్టర్ ఎం/ఎస్ ఎస్.జే. ఎంటర్‌ప్రైజెస్, సంస్థ యజమాని అమిత్ మైటీ, దక్షిణ తూర్పు మధ్య రైల్వే (ఎస్ఈసీఆర్)కు చెందిన గుర్తుతెలియని అధికారులు, మరికొందరిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సీబీఐ సోమవారం వెల్లడించింది. దుమ్రీ ఖుర్ద్ రైల్వే సైడింగ్‌లో బాక్స్‌ఎన్ బోగీలు, రైల్వే ట్రాక్‌లు, గూడ్స్ షెడ్ ప్లాట్‌ఫారాలను శుభ్రపరిచే పనులను ఎస్.జే. ఎంటర్‌ప్రైజెస్‌కు అప్పగించారు. అయితే ఈ పనుల పేరుతో వ్యర్థ బొగ్గును తొలగిస్తున్నట్లు చూపించి, వినియోగానికి అనువైన నాణ్యమైన బొగ్గును సేకరించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించినట్లు దర్యాప్తులో తేలినట్లు సీబీఐ తెలిపింది. ఈ అక్రమాలతో వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (డబ్ల్యూసీఎల్)కు భారీ ఆర్థిక నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. ఈ ఏడాది మే 21న సీబీఐ అవినీతి నిరోధక విభాగం, ఎస్ఈసీఆర్, డబ్ల్యూసీఎల్ విజిలెన్స్ బృందాలు సంయుక్తంగా దుమ్రీ ఖుర్ద్ రైల్వే స్టేషన్, సైడింగ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా రైల్వే బోగీలు, ట్రాక్‌ల నుంచి సేకరించిన బొగ్గును రైల్వే ప్రాంగణంలో నిల్వ చేసినట్లు గుర్తించారు. అక్కడ మొత్తం 1,427 మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వ ఉండగా, నమూనాలను సీఎస్ఐఆర్–సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్ రీసెర్చ్ (సీఐఎంఎఫ్ఆర్), నాగ్‌పూర్‌కు పంపించారు. పరీక్షల్లో అది జీ–12 గ్రేడ్‌కు చెందిన నాణ్యమైన బొగ్గుగా నిర్ధారణ అయింది.

నకిలీ గేట్‌పాస్‌లతో బొగ్గు తరలింపు

దుమ్రీ ఖుర్ద్ సైడింగ్‌లో బొగ్గు నిర్వహణ, శుభ్రత పనుల కోసం ఇప్పటికే డబ్ల్యూసీఎల్ ఎం/ఎస్ చడ్డా ట్రేడింగ్ కంపెనీని నియమించినప్పటికీ, ఎస్.జే. ఎంటర్‌ప్రైజెస్ అక్కడి నుంచి బొగ్గును అక్రమంగా తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ వ్యవహారంలో కాంట్రాక్టర్‌తో కుమ్మక్కైన గుర్తుతెలియని ఎస్ఈసీఆర్ అధికారులు మార్చి 21, 24 తేదీల్లో మొత్తం 18 గేట్‌పాస్‌లు జారీ చేసి, నాణ్యమైన బొగ్గును వ్యర్థ పదార్థంగా చూపినట్లు సీబీఐ తెలిపింది. ఆ గేట్‌పాస్‌ల ఆధారంగా 720 మెట్రిక్ టన్నుల జీ–12 గ్రేడ్ బొగ్గును బయటకు తరలించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించినట్లు ఆరోపించింది.

డబ్ల్యూసీఎల్‌కు నష్టం.. కాంట్రాక్టర్‌కు లాభం

డబ్ల్యూసీఎల్ విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు జీ–12 గ్రేడ్ బొగ్గును సబ్సిడీపై టన్నుకు సుమారు రూ.2,400కు సరఫరా చేస్తుండగా, బహిరంగ మార్కెట్‌లో అదే బొగ్గు ధర రూ.4,000 నుంచి రూ.4,200 వరకు ఉంది. ఈ ధరల వ్యత్యాసాన్ని ఆసరాగా చేసుకుని కాంట్రాక్టర్ రూ.28.80 లక్షల మేర అక్రమ లాభం పొందగా, అదే మొత్తంలో డబ్ల్యూసీఎల్‌కు నష్టం వాటిల్లినట్లు సీబీఐ వెల్లడించింది. ఈ వ్యవహారంలో ఇతరుల ప్రమేయంపై కూడా దర్యాప్తు కొనసాగు తున్నట్లు అధికారులు తెలిపారు.

వన్యప్రాణుల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- దేశవ్యాప్తంగా డీఆర్ఐ ప్రత్యేక ఆపరేషన్
- 440 అంతరించిపోతున్న జంతువులు, 15 కిలోల ఏనుగు దంతాలు స్వాధీనం
- 33 మంది స్మగ్లర్ల అరెస్టు
- రాజస్థాన్, కర్ణాటక, బెంగాల్, మహారాష్ట్రలో ఏకకాలంలో దాడులు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వన్యప్రాణుల అక్రమ రవాణాపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) నిర్వహించిన విస్తృత స్థాయి ప్రత్యేక ఆపరేషన్‌లో 440 అంతరించిపోతున్న జంతువులను రక్షించింది. అలాగే సుమారు 15 కిలోల ఏనుగు దంతాలతో తయారైన వస్తువులను స్వాధీనం చేసుకుంది. ఈ కేసులకు సంబంధించి అక్రమ రవాణాలో పాల్గొన్న 33 మందిని అరెస్టు చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. గూఢచారి సమాచారాన్ని ఆధారంగా చేసుకుని దేశంలోని పలు రాష్ట్రాల్లో ఒకేసారి నిర్వహించిన ఈ దాడుల్లో అంతర్రాష్ట్ర వన్యప్రాణుల అక్రమ రవాణా ముఠాల కార్యకలాపాలను డీఆర్ఐ ఛేదించింది. భారీ మొత్తంలో వన్యప్రాణులు, నిషేధిత ఏనుగు దంతాల వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 10న రాజస్థాన్‌లోని సుజన్‌గఢ్ సమీపంలో నిర్వహించిన దాడుల్లో ఏనుగు దంతాల అక్రమ వ్యాపారంలో పాల్గొంటున్న నలుగురిని అరెస్టు చేసి, వీరి వద్ద నుంచి సుమారు 11 కిలోల ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకున్నారు. భారత చట్టాల ప్రకారం ఏనుగు దంతాల కొనుగోలు, విక్రయం, ఎగుమతి పూర్తిగా నిషేధమని అధికారులు మరోసారి స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న డీఆర్ఐ అధికారులు, బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌కు తరలించినట్లు అనుమానిస్తున్న ఏనుగు దంతాలతో తయారుచేసిన రెండు దేవతా విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. ఇదే సమయంలో కర్ణాటకలోని మైసూరులో నిర్వహించిన మరో దాడిలో నాలుగు కిలోల ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అనంతరం వారిని తదుపరి చర్యల కోసం అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

అంతర్రాష్ట్ర ముఠాల గుట్టురట్టు

ఈ నెల 7, 8 తేదీల్లో మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లలో సంయుక్తంగా చేపట్టిన మరో ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర వన్యప్రాణుల అక్రమ రవాణా ముఠాను డీఆర్ఐ ఛేదించింది. డీఆర్ఐ ముంబయి విభాగం, సీబీఐ ఆర్థిక నేరాల విభాగం, వన్యప్రాణుల నేర నియంత్రణ బ్యూరో (డబ్ల్యూసీబీ) కలిసి నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో 15 స్లో లోరిస్‌లు, రెండు బింటురాంగ్‌లు, 28 స్టార్ టార్టాయిస్‌లు, ఆరు ఈజిప్షియన్ వల్చర్లు, రెండు షిక్రా పక్షులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో డీఆర్ఐ అందించిన సమాచారంతో సీబీఐ దర్యాప్తు చేపట్టి ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వన్యప్రాణుల అక్రమ రవాణా, నిషేధిత వన్యప్రాణి ఉత్పత్తుల అక్రమ వ్యాపారాన్ని అరికట్టేందుకు దేశవ్యాప్తంగా మరింత కఠిన చర్యలు కొనసాగిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

మసీదులు, మదర్సాలపై చర్యలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

- ఇండో–పాక్ సరిహద్దుకు 50 కి.మీ. పరిధిలోని మత నిర్మాణాలపై స్టే నిరాకరణ
- ప్రతి కేసును విడివిడిగా పరిశీలించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని రాజస్థాన్ ప్రభుత్వానికి ఆదేశం
- ఇది మత వివక్ష కాదు.. జాతీయ భద్రతకు సంబంధించిన వ్యవహారం: రాజస్థాన్ హైకోర్టు

RAJASTHAN HIGH COURT

జోధ్‌పూర్: ఇండో–పాకిస్థాన్ సరిహద్దుకు 50 కిలోమీటర్ల పరిధిలోని మసీదులు, మదర్సాలు, దర్గాలపై ప్రభుత్వం చేపడుతున్న చర్యలను నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను రాజస్థాన్ హైకోర్టు సోమవారం తిరస్కరించింది. అయితే ప్రతి నిర్మాణాన్ని విడివిడిగా పరిశీలించి, చట్టబద్ధమైన ప్రక్రియను పూర్తిగా అనుసరించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ సమీర్ జైన్ సరిహద్దు ప్రాంతాల్లోని నిర్మాణాల పరిశీలన కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ కమిటీలో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ప్రతినిధితో పాటు సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) సభ్యులుగా ఉండాలని సూచించారు. ప్రతి నిర్మాణానికి సంబంధించిన పత్రాలు, నిఘా సంస్థల నివేదికలు, చట్టపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే ఖాళీ చేయించడం లేదా కూల్చివేత వంటి చర్యలపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ వ్యవహారం మత వివక్షకు సంబంధించినది కాదని, జాతీయ భద్రతతో పాటు చట్టాల అమలుకు సంబంధించిన అంశమని హైకోర్టు స్పష్టం చేసింది. సహజ న్యాయ సూత్రాలు ఎంతో ముఖ్యమైనవేనని పేర్కొన్నప్పటికీ, జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని ప్రతి సందర్భంలో బహిర్గతం చేయడం సాధ్యం కాదని కోర్టు వ్యాఖ్యానించింది. జైసల్మేర్, బార్మేర్, బికనీర్ జిల్లాల్లోని పలు మసీదులు, మదర్సాలు, దర్గాలకు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ పీర్ మహ్మద్ షా జిలానీ దర్గా సమితి సహా పలువురు హైకోర్టును ఆశ్రయించారు. కేంద్ర ప్రభుత్వం జూన్‌లో ప్రకటించిన విధానానికి అనుగుణంగా సరిహద్దుకు 50 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అనధికార నిర్మాణాలను తొలగించే చర్యల్లో భాగంగానే ఈ నోటీసులు జారీ చేశారని పిటిషనర్లు పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని నిర్మాణాలు కూల్చివేయడంతో తమ సంస్థలపైనా అదే చర్యలు తీసుకునే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

అనుమతులు లేకుండానే శాశ్వత నిర్మాణాలు

ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్, అదనపు సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ భూములు లేదా వ్యవసాయ భూముల్లో అవసరమైన అనుమతులు లేకుండా శాశ్వత నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించామని కోర్టుకు వివరించారు. సరిహద్దు ప్రాంతం వ్యూహాత్మకంగా అత్యంత సున్నిత మైనదని, నిఘా సంస్థల నివేదికలను పరిగణనలోకి తీసుకుని చర్యలు చేపట్టామని తెలిపారు. అలాగే రాజస్థాన్ రిలీజియస్ బిల్డింగ్స్ అండ్ ప్లేసెస్ చట్టం ప్రకారం ప్రజా మతపరమైన నిర్మాణాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరి అయినప్పటికీ, ఈ కేసుల్లో అలాంటి అనుమతులు లేవని ప్రభుత్వం వెల్లడించింది. పిటిషనర్లలో చాలామంది సంబంధిత మత సంస్థలకు తామే చట్టబద్ధ ప్రతినిధులమని నిరూపించే ఆధారాలను సమర్పించలేదని హైకోర్టు పేర్కొంది. ప్రస్తుతం జారీ చేసినవి కేవలం వివరణ కోరుతూ ఇచ్చిన నోటీసులేనని, వెంటనే కూల్చివేతకు ఆదేశాలు జారీ చేయలేదని స్పష్టం చేసింది. తక్షణ కూల్చివేత జరుగుతుందన్న పిటిషనర్ల ఆందోళన ఊహాజనితమేనని పేర్కొంటూ అన్ని పిటిషన్లను కొట్టివేసింది.

పీకే ఆస్తులు రూ.96 కోట్లు

భార్య పేరిట రూ.101.93 కోట్ల ఆస్తులు

పాట్నా: బిహార్‌లోని బాంకీపూర్ అసెంబ్లీ ఉపఎన్నికకు జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్‌లో తన పేరిట రూ.96.06 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో రూ.22.19 కోట్ల చరాస్తులు, రూ.73.87 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. అలాగే ఆయన భార్య పేరిట రూ.101.93 కోట్ల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ప్రశాంత్ కిశోర్ వద్ద రూ.65,570 నగదు, ఆయన భార్య వద్ద రూ.1.95 లక్షల నగదు ఉన్నట్లు వెల్లడించారు. తనకు చెందిన ప్రైవేటు సంస్థ 2024–25లో జనసురాజ్ పార్టీకి రూ.85 కోట్ల విరాళం, జనసు రాజ్ ఫౌండేషన్‌కు రూ.50 లక్షలు అందించినట్లు పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ రాజీనా మాతో ఖాళీ అయిన బాంకీ పూర్ అసెంబ్లీ స్థానానికి జూలై 30న ఉపఎన్నిక, ఓట్ల లెక్కింపు ఆగస్టు 3న చేపట్టనున్నారు.

క్షీణించిన సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యం

- 16వ రోజుకు చేరిన నిరాహార దీక్ష
- 8.2 కిలోల బరువు తగ్గారన్న సీజేపీ
- కేంద్రం వెంటనే చర్చలు ప్రారంభించాలని డిమాండ్

న్యూఢిల్లీ: పరీక్షల నిర్వహణలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలకు నిరసనగా జంతర్‌మంతర్‌లో వాతావరణ ఉద్యమకారుడు, విద్యావేత్త సోనం వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష సోమవారంతో 16వ రోజుకు చేరుకుంది. దీక్ష ప్రారంభమైనప్పటి నుంచి ఆయన 8.2 కిలోల బరువు కోల్పోయారని, రక్తంలో గ్లూకోజ్ స్థాయి 67 ఎంజీ/డీఎల్‌కు పడిపోయిందని కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) విడుదల చేసిన ఆరోగ్య బులెటిన్‌లో పేర్కొంది. దీర్ఘకాల నిరాహార దీక్ష కారణంగా ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారిందని పార్టీ తెలిపింది. ఇదే ఆందోళనలో పాల్గొంటున్న ఏఐఎస్ఏ కార్యకర్త దీపక్ ఆరోగ్యం విషమించడంతో రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. నిరసనకారుల ఆరోగ్యం క్షీణిస్తున్నా కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించాలని కోరుతూ, తమ డిమాండ్లు నెరవేరే వరకు వాంగ్‌చుక్ దీక్ష కొనసాగుతుందని తెలిపారు. జూలై 20న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సోమవారం ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిషి నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి బృందం నిరసన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించగా, పలువురు ప్రతిపక్ష నేతలు కూడా మద్దతు తెలిపారు.

పులిని చూసి ఆనకట్టలోకి దూకిన తండ్రీకొడుకులు

- నీట మునిగి మృతి..
- నాగ్‌పూర్‌లో విషాదం

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లాలో పులిని చూసి ప్రాణభయంతో ఆనకట్టలోకి దూకిన తండ్రీకొడుకులు నీట మునిగి మృతిచెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. డియోలాపార్ అటవీ పరిధిలోని దులారా గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం ఈ ఘటన జరిగినట్లు అటవీశాఖ అధికారులు సోమవారం వెల్లడించారు. రామ్‌టెక్ ఉపవిభాగ సహాయ అటవీ సంరక్షణ అధికారి గోవింద్ లూచే తెలిపిన వివరాల ప్రకారం.. దులారా గ్రామానికి చెందిన జీవన్ కోకడే (35), అతని ఏడేళ్ల కుమారుడు జతిన్, మరో బంధువుతో కలిసి వ్యవసాయ క్షేత్రం సమీపంలోని ఆనకట్ట వద్ద చేపల వేటకు వెళ్లారు. ఈ సమయంలో ఆనకట్ట సమీపంలో పులి సంచరిస్తున్నట్లు వారు గుర్తించారు. అకస్మాత్తుగా పులి కనిపించడంతో తీవ్ర భయాందోళనకు గురైన జీవన్ కోకడే, అతని కుమారుడు జతిన్ ప్రాణాలు కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఆనకట్టలోకి దూకారు. అయితే ఇద్దరికీ ఈత రాకపోవడంతో నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. వారితో ఉన్న బంధువు మాత్రం ప్రమాదం నుంచి బయటపడినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు, అటవీశాఖ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం తండ్రీకొడుకుల మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాగ్‌పూర్ జిల్లా పరిసరాల్లోని సుమారు 200 కిలోమీటర్ల పరిధిలో పలు పులుల అభయారణ్యాలు ఉండటంతో అటవీ ప్రాంతాలు, జలాశయాల సమీపంలో పులుల సంచారం తరచుగా కనిపిస్తుంటుందని అటవీశాఖ అధికారులు తెలిపారు.

బంగాళాఖాతంలో విషాదం

- ట్రాలర్ మునిగి తొమ్మిది మంది మత్స్యకారుల మృతి
- ఎనిమిది రోజుల తర్వాత గుర్తింపు
- మరో ఆరుగురి కోసం కొనసాగుతున్న గాలింపు
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

కోల్‌కతా/బాలాసోర్: పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల తీరానికి సమీపంలోని బంగాళాఖాతంలో మునిగిపోయిన చేపల వేట ట్రాలర్‌లో చిక్కుకున్న తొమ్మిది మంది మత్స్యకారుల మృతదేహాలను అధికారులు వెలికితీశారు. మరో ఆరుగురు గల్లంతు కాగా, వారి కోసం భారత తీరరక్షక దళం, పోలీసులు, స్థానిక మత్స్యకారులు సంయుక్తంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. తూర్పు మేదినిపూర్ జిల్లా శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ నుంచి జాయ్ మా కాళీ ట్రాలర్ జూలై 2న 15 మంది మత్స్యకారులతో సముద్రంలో చేపల వేటకు వెళ్లింది. జూలై 6 తర్వాత ట్రాలర్‌తో సంబంధాలు పూర్తిగా తెగిపోవడంతో విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఎనిమిది రోజుల అనంతరం బక్కాలి తీరానికి సుమారు 35 కిలోమీటర్ల దూరంలోని బఘేర్ చార్ ప్రాంతంలో సముద్రగర్భంలో ట్రాలర్‌ను గుర్తించి, ఇతర పడవల సహాయంతో సీతారాంపూర్ తీరానికి తీసుకొచ్చారు. రాత్రంతా సాగిన సహాయక చర్యల్లో ట్రాలర్‌లో చిక్కుకున్న తొమ్మిది మంది మృతదేహాలను వెలికితీశారు. అవి పూర్తిగా కుళ్లిపోయినందున డీఎన్ఏ పరీక్షల అనంతరం మాత్రమే వారి గుర్తింపును నిర్ధారించనున్నట్లు అధికారులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం కాక్‌ద్వీప్ ఉపవిభాగ ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన మరో ఆరుగురు మత్స్యకారుల కోసం గాలింపు కొనసాగుతోంది. ప్రాథమికంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగానే ట్రాలర్ మునిగిపోయి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నప్పటికీ, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. గల్లంతైన వారిలో ఒడిశా రాష్ట్రం బాలాసోర్ జిల్లాకు చెందిన ముగ్గురు సోదరులు కూడా ఉన్నారు. ఇదిలా ఉండగా, ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది.

నాగాలాండ్‌లో ఐఈడీ పేలుడు

- నలుగురు భద్రతా సిబ్బంది, ఓ పౌరుడికి గాయాలు
- ఘటనపై దర్యాప్తు ముమ్మరం.. దాడిని ఖండించిన గవర్నర్, సీఎం

డిమాపూర్: నాగాలాండ్‌లోని చుమౌకెడిమా జిల్లాలో సోమవారం జరిగిన అనుమానాస్పద ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్ డివైస్ (ఐఈడీ) పేలుడులో అస్సాం రైఫిల్స్‌కు చెందిన ఓ జవాను వీరమరణం పొందగా, మరో నలుగురు భద్రతా సిబ్బందితో పాటు ఓ పౌరుడు గాయపడ్డారు. మధ్యాహ్నం షోఖువి ప్రాంతంలో జరిగిన ఈ ఘటనపై భద్రతా దళాలు దర్యాప్తు ప్రారంభించాయి. రక్షణశాఖ ప్రజాసంబంధాల అధికారి కల్నల్ అమిత్ శుక్లా తెలిపిన వివరాల ప్రకారం.. విధుల్లో భాగంగా అస్సాం రైఫిల్స్ సిబ్బంది మినీ ట్రక్కులో ప్రయాణిస్తుండగా వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని పేలుడు సంభవించింది. ఈ ఘటనలో అస్సాం రైఫిల్స్ ట్రైనింగ్ సెంటర్ అండ్ స్కూల్‌కు చెందిన హవిల్దార్ మహ్మద్ ఇక్బాల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన నలుగురు జవాన్లను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు ధాటికి సమీపంలో ఉన్న ఓ పౌరుడు కూడా గాయపడగా, అక్కడే నిలిపి ఉన్న ఓ ఆటోరిక్షా పూర్తిగా ధ్వంసమైంది. ఘటన అనంతరం భద్రతా బలగాలు ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థా బాధ్యత స్వీకరించకపోయినా, అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. వీరమరణం పొందిన జవాను కుటుంబానికి సానుభూతి తెలియ జేస్తూ, నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. అస్సాం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ వికాస్ లఖేరా కూడా హవిల్దార్ మహ్మద్ ఇక్బాల్‌కు ఘన నివాళులర్పించారు.

ట్రంప్-ఐఆర్ఎస్ కేసుపై న్యాయమూర్తి ఆగ్రహం

- వ్యక్తిగత ప్రయోజనాల కోసం న్యాయవ్యవస్థను వినియోగించుకునే ప్రయత్నమని వ్యాఖ్య

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతర్గత రెవెన్యూ సేవ (ఐఆర్ఎస్)పై దాఖలు చేసిన వ్యాజ్యంపై అమెరికా జిల్లా న్యాయమూర్తి కాథలిన్ విలియమ్స్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు దురుద్దేశంతో దాఖలైనదని, న్యాయవ్యవస్థను వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించుకునే ప్రయత్నం జరిగినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. సంబంధిత న్యాయవాదులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు. ట్రంప్ తన పన్ను వివరాలు లీక్ అయ్యాయంటూ ఐఆర్ఎస్‌పై దావా వేశారు. అయితే ఆ సంస్థపై అధ్యక్షుడిగా తనకు ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ వ్యాజ్యం వేయడం ద్వారా కోర్టును స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నం జరిగిందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.

ప్రజానావ
హైదరాబాద్ । మంగళవారం 14 జూలై 2026

రోకోపైనే ఆశలు

రోహిత్, కోహ్లీ, బుమ్రా పునరాగమనంతో జట్టుకు కొత్త ఊపు

- నేడు ఇంగ్లండ్‌తో భారత్ తొలి వన్డే
- 2027 ప్రపంచకప్ సన్నాహకాల్లో కీలక సిరీస్
- ఎడ్జ్‌బాస్టన్‌లో ఇంగ్లండ్‌కు గట్టి సవాల్ విసరనున్న టీమిండియా

బర్మింగ్‌హామ్: వరుస టీ20 పరాజయాలతో ఆత్మవిశ్వాసం కోల్పోయిన టీమిండియా.. ఇప్పుడు వన్డే ఫార్మాట్‌లో విజయపథంలోకి తిరిగి రావాలని లక్ష్యంగా పెట్టుకుంది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా మంగళవారం ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య ఇంగ్లండ్‌ను భారత్ ఎదుర్కొంటుంది. ఈ సిరీస్‌లో సీనియర్ స్టార్‌లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రావడం భారత జట్టుకు పెద్ద బలంగా మారింది. టీ20 సిరీస్‌లో ఐర్లాండ్‌తో 0–2, ఇంగ్లండ్‌తో 0–4 తేడాతో పరాజయం పాలైన భారత్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వన్డే సిరీస్‌లో విజయం సాధించి జట్టు ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పొందాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. 2027 వన్డే ప్రపంచకప్‌కు ముందు సరైన జట్టు కూర్పును ఖరారు చేసుకునే దిశగా ఈ సిరీస్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

సీనియర్లపై భారీ బాధ్యత

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరూ గత దశాబ్దంగా భారత బ్యాటింగ్‌కు వెన్నెముకలా నిలిచారు. ఇంగ్లండ్ పిచ్‌లపై జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ వంటి వేగ బౌలర్లను ఎదుర్కోవడం సవాలే అయినప్పటికీ, అలాంటి పరిస్థితుల్లో విజయవంతంగా ఆడిన అనుభవం ఈ ఇద్దరికీ ఉంది. జట్టు క్లిష్ట పరిస్థితుల్లో నిలబెట్టే బాధ్యత కూడా వీరిదే. శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్‌తో కలిసి భారత టాప్‌ఆర్డర్ బలంగా కనిపిస్తోంది. వీరిలో ఎవరైనా పెద్ద ఇన్నింగ్స్ ఆడితే మ్యాచ్ స్వరూపమే మారే అవకాశం ఉంది. బ్యాటింగ్‌తో పోలిస్తే భారత బౌలింగ్‌పైనే ఎక్కువ దృష్టి నెలకొంది. విశ్రాంతి అనంతరం జస్‌ప్రీత్ బుమ్రా జట్టులోకి రావడం ఊరటనిచ్చే అంశం. అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, శివమ్ దూబే వేగదాడిలో కీలక పాత్ర పోషించనున్నారు. స్పిన్ విభాగంలో అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌తో పాటు కుల్దీప్ యాదవ్‌కు అవకాశం లభించే అవకాశముంది. ఇంగ్లండ్ పరిస్థితుల్లో కుల్దీప్ స్పిన్ భారత జట్టుకు కీలక ఆయుధంగా మారొచ్చు. ఇంగ్లండ్ ఇటీవల వన్డేలు ఆడకపోయినా, టీ20 సిరీస్‌లో భారత్‌పై సాధించిన ఘన విజయం ఆ జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. హ్యారీ బ్రూక్ సారథ్యంలో జో రూట్, జోస్ బట్లర్, బెన్ డకెట్, జేకబ్ బెథెల్ వంటి బలమైన బ్యాటింగ్ లైనప్‌తో ఇంగ్లండ్ బరిలోకి దిగుతోంది. బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్, సాకిబ్ మహ్మూద్, గస్ అట్కిన్సన్ భారత బ్యాటర్లకు పరీక్షగా నిలవనున్నారు.

వన్డేలను ఓవర్లను కుదించొద్దు..

వన్డే క్రికెట్‌ను 50 ఓవర్ల నుంచి 40 ఓవర్లకు కుదించాలన్న ప్రతిపాదనను శుభ్‌మన్ గిల్ వ్యతిరేకించాడు. వన్డేలకు మళ్లీ ఆదరణ తీసుకురావాలంటే ద్వైపాక్షిక సిరీస్‌లకు బదులుగా ట్రై, క్వాడ్ సిరీస్‌లను నిర్వహించాలని సూచించాడు. గతంలో ఇలాంటి టోర్నీలు అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయని గుర్తుచేశాడు. 50 ఓవర్ల ప్రపంచకప్ ఇప్పటికీ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన టోర్నీగానే భావిస్తానని గిల్ పేర్కొన్నాడు. 2027 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని ఇంగ్లండ్ సిరీస్‌లో సరైన జట్టు కూర్పును పరీక్షిస్తామని తెలిపాడు. యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వడం భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని, గాయాల కారణంగా నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణాలను ఆడించలేకపోయామని వివరించాడు.

వారిద్దరూ జట్టుకు కీలకం

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇప్పటికీ భారత వన్డే జట్టుకు వెన్నెముకలేనని గిల్ స్పష్టం చేశాడు. వారి అనుభవం క్లిష్ట పరిస్థితుల్లో జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు. 2027 ప్రపంచకప్‌కు అనువైన జట్టు కూర్పుపై కోహ్లీతో ఇప్పటికే చర్చించినట్లు వెల్లడించాడు. అలాగే జస్‌ప్రీత్ బుమ్రా పునరాగమనం భారత పేస్ దాడిని మరింత బలోపేతం చేస్తుందని, ఇంగ్లండ్‌పై సిరీస్ గెలవడమే లక్ష్యమని తెలిపాడు.



వింబుల్డన్ మళ్లీ సిన్నర్‌దే..

- వరుసగా రెండోసారి టైటిల్ కైవసం
- ఫైనల్‌లో జ్వెరెవ్‌పై అద్భుత విజయం
- 6–7, 7–6, 6–3, 6–4తో జర్మన్ స్టార్‌కి మరోసారి నిరాశే
- కెరీర్‌లో ఐదో గ్రాండ్‌స్లామ్‌ను అందుకున్న ప్రపంచ నంబర్‌వన్

లండన్: ప్రపంచ నంబర్‌వన్ జానిక్ సిన్నర్ మరోసారి వింబుల్డన్ ఛాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను 6–7 (7), 7–6 (2), 6–3, 6–4తో ఓడించి వరుసగా రెండోసారి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. దీంతో సిన్నర్ కెరీర్‌లో ఐదో గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని అందుకున్నాడు. తొలి సెట్‌ను జ్వెరెవ్ గెలిచినా.. రెండో సెట్‌లో సిన్నర్ సమం చేశాడు. మూడో సెట్‌లో జ్వెరెవ్ మోకాలికి స్వల్ప గాయం కావడంతో మ్యాచ్‌పై సిన్నర్ పూర్తి ఆధిపత్యం చెలాయించి వరుసగా రెండు సెట్లు గెలిచి విజేతగా నిలిచాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో నిరాశపరిచిన సిన్నర్.. వింబుల్డన్‌లో అద్భుతంగా పుంజుకుని మరో గ్రాండ్‌స్లామ్‌ను సొంతం చేసుకున్నాడు. మరోవైపు జ్వెరెవ్‌కు తొలి వింబుల్డన్ టైటిల్ కల మరోసారి నెరవేరలేదు. అయితే ఈ టోర్నీతో అతడు ఏటీపీ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్–2 స్థానానికి చేరనున్నాడు.

లార్డ్స్‌లో చరిత్ర సృష్టించిన అమ్మాయిలు

- చారిత్రాత్మక మహిళల టెస్టులో ఇంగ్లండ్‌పై భారత్ 270 పరుగుల భారీ విజయం
- యశస్తిక సెంచరీ.. క్రాంతి గౌడ్ ఐదు వికెట్ల మాయాజాలం

Rothesay Match
England v dia
Rothesay
TEST MATCH
Winners
2026
Rothesay
Protecting Pensions

లండన్: లార్డ్స్ మైదానంలో జరిగిన తొలి మహిళల టెస్టులో భారత జట్టు చరిత్ర సృష్టించింది. ఆతిథ్య ఇంగ్లండ్‌ను 270 పరుగుల భారీ తేడాతో ఓడించి చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. 457 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ 186 పరుగులకే ఆలౌటైంది. నాలుగో రోజు మిగిలిన నాలుగు వికెట్లను త్వరగా కూల్చిన భారత్ మ్యాచ్‌ను ముగించింది. సోఫీ ఎక్లెస్టోన్ అర్ధశతకం చేసినా ఫలితం లేకపోయింది.

యశస్తిక–క్రాంతి మెరుపులు

భారత్ విజయానికి యశస్తిక భాటియా సెంచరీతో బలమైన పునాది వేయగా, స్మృతి మంధాన కీలక ఇన్నింగ్స్ ఆడింది. బౌలింగ్‌లో క్రాంతి గౌడ్ ఐదు వికెట్లు తీసి మ్యాచ్‌లో మొత్తం ఏడు వికెట్లతో లార్డ్స్ హానర్స్ బోర్డులో చోటు సంపాదించింది. సయాలి సాత్ఘరే, స్నేహ్ రాణా, దీప్తి శర్మ కూడా కీలక వికెట్లు సాధించి ఇంగ్లండ్‌ను కట్టడి చేశారు.

ఇంగ్లండ్‌పై భారత్‌దే ఆధిపత్యం

ఈ విజయంతో మహిళల టెస్టుల్లో ఇంగ్లండ్‌పై భారత్ ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఇప్పటివరకు జరిగిన 16 టెస్టుల్లో భారత్‌కు నాలుగు విజయాలు, ఇంగ్లండ్‌కు ఒక్క విజయం మాత్రమే దక్కగా, మిగిలిన 11 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. మ్యాచ్‌కు ముందు టీమిండియా మాజీ ఆటగాడు, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ భారత జట్టును ఉత్సాహపరచగా, ఐసీసీ చైర్మన్ జయ్ షా కూడా స్టాండ్స్‌లో మ్యాచ్‌ను వీక్షించారు.

క్రిప్టో మోసం

- ఏటీసీ కాయిన్ పేరిట రూ.84 కోట్ల వసూళ్లు
- రూ.55.50 కోట్ల ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

న్యూఢిల్లీ: క్రిప్టోకరెన్సీ పెట్టుబడుల పేరుతో జరిగిన భారీ మోసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక చర్యలు చేపట్టింది. మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ముంబైలోని బ్యాంకు డిపాజిట్లు, నాలుగు ఫ్లాట్లు, 11 వాణిజ్య దుకాణాలతో కలిపి రూ.55.50 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా అటాచ్ చేసింది. ఈడీ వివరాల ప్రకారం.. జేవియా సర్వీసెస్ క్లబ్ ఇండియా, వివా కార్డ్ రిటైల్ సర్వీసెస్, సుభాష్‌చంద్ర జేవియా, చిరాగ్ జేవియా కలిసి ఏటీసీ కాయిన్ పేరిట అధిక లాభాల పేరుతో పెట్టుబడిదారుల నుంచి సుమారు రూ.84 కోట్లు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నిధులతో స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. ముంబై పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా నమోదైన ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ తెలిపింది.

స్పైస్‌జెట్‌కు మరో ఎదురుదెబ్బ

- నాలుగు విమానాల స్వాధీనానికి లీజింగ్ సంస్థల చర్యలు
- డీ-రిజిస్ట్రేషన్‌కు డీజీసీఏను ఆశ్రయించిన ఐర్లాండ్ కంపెనీలు

ముంబై: ఆర్థిక, న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్పైస్‌జెట్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. లీజుకు ఇచ్చిన నాలుగు బోయింగ్ 737–8 మ్యాక్స్ విమానాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఐర్లాండ్‌కు చెందిన రెండు లీజింగ్ సంస్థలు డీజీసీఏను ఆశ్రయించి, డీ-రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేశాయి. సాంకేతిక లోపాల కారణంగా ఈ విమానాలు చాలాకాలంగా సేవలకు దూరంగా ఉన్నాయని, వాటి డీ–రిజిస్ట్రేషన్‌తో వినియోగంలో లేని విమానాలపై లీజు భారం తగ్గుతుందని స్పైస్‌జెట్ తెలిపింది. ప్రస్తుతం సంస్థ వద్ద 11 విమానాలు మాత్రమే సేవల్లో ఉండగా, 42 విమానాలు గ్రౌండెడ్‌గా ఉన్నాయి. దీంతో సంస్థపై ఆర్థిక ఒత్తిడి కొనసాగుతోంది.

ఒడిదుడుకుల మధ్య లాభాలు

- ఐటీ షేర్ల జోరుతో నష్టాల నుంచి కోలుకున్న సెన్సెక్స్, నిఫ్టీ
- పశ్చిమాసియా ఉద్రిక్తతలు, పెరిగిన చమురు ధరలతో ప్రారంభంలో పతనం
- చివరికి 47 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్.. స్వల్పంగా పెరిగిన నిఫ్టీ
- టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్ షేర్లలో బలమైన కొనుగోళ్లు

ముంబై: పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ముడిచమురు ధరల పెరుగుదల ప్రభావంతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ప్రారంభమైనప్పటికీ.. ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లతో కోలుకుని స్వల్ప లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 47.01 పాయింట్లు (0.06 శాతం) పెరిగి 77,616.40 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 4.10 పాయింట్లు (0.02 శాతం) లాభపడి 24,211 వద్ద స్థిరపడింది. వరుసగా మూడో ట్రేడింగ్ రోజూ రెండు సూచీలు లాభాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 711 పాయింట్లకు పైగా క్షీణించి 76,857.43 కనిష్ఠ స్థాయికి చేరింది. అనంతరం టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ వంటి ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో మార్కెట్ తిరిగి పుంజుకుంది. అయితే చివరి గంటలో లాభాల స్వీకరణతో సూచీలు స్వల్ప లాభాలకే పరిమితమయ్యాయి. సెన్సెక్స్‌లో టీసీఎస్ 5.43 శాతం ఎగబాకి అగ్రగామిగా నిలవగా, హెచ్‌సీఎల్ టెక్ 5.02 శాతం, టెక్ మహీంద్రా 3.34 శాతం, ఇన్ఫోసిస్ 3.17 శాతం, ఎన్‌టీపీసీ 2.18 శాతం, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.83 శాతం లాభపడ్డాయి. మరోవైపు టాటా స్టీల్, ఎటర్నల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మారుతి, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టపోయాయి.

ముడిచమురు ప్రభావం

బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 2.57 శాతం పెరిగి 77.96 డాలర్లకు చేరింది. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి పరిణామాలపై ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండటంతో మార్కెట్‌లో రోజంతా ఒడిదుడుకులు కనిపించాయని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) శుక్రవారం రూ.2,603.72 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్ గణాంకాలు వెల్లడించాయి.

హెచ్‌పీ ఇండియాకు భారీ జరిమానా

- మరో 16 రీ–సెల్లర్లపై కూడా..
- పోటీ చట్టాల ఉల్లంఘనపై సీసీఐ చర్య
- అక్రమ వ్యాపార పద్ధతులు నిలిపివేయాలని ఆదేశం

న్యూఢిల్లీ: ప్రింటర్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన టోనర్లు, కాట్రిడ్జ్‌లు తదితర వినియోగ వస్తువుల విక్రయంలో పోటీ చట్టాలను ఉల్లంఘించినట్లు తేలడంతో హెచ్‌పీ ఇండియా, దాని 16 రీ–సెల్లర్లపై భారత పోటీ కమిషన్ (సీసీఐ) మొత్తం రూ.14.28 కోట్ల జరిమానా విధించింది. అక్రమ వ్యాపార పద్ధతులను వెంటనే నిలిపివేయాలని కూడా ఆదేశించింది. సీసీఐ సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం హెచ్‌పీ ఇండియాపై రూ.11.98 కోట్ల జరిమానా, మిగిలిన 16 రీ–సెల్లర్లపై కలిపి రూ.2.30 కోట్ల జరిమానా విధించారు. సంబంధిత సంస్థల కొందరు అధికారులపైనా వ్యక్తిగతంగా జరిమానాలు విధించినట్లు తెలిపింది. 2020లో స్వప్రేరణతో చేపట్టిన విచారణలో హెచ్‌పీ ఇండియా, దాని రీ–సెల్లర్లు కలిసి టోనర్లు, కాట్రిడ్జ్‌ల విక్రయాలు, సరఫరాలో కార్టెల్‌గా వ్యవహరించినట్లు సీసీఐ నిర్ధారించింది. పోటీని పరిమితం చేసే విధంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించినట్లు తేలడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. వినియోగదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఇటువంటి చర్యలను భవిష్యత్తులో పునరావృతం చేయరాదని హెచ్‌పీ ఇండియా, సంబంధిత రీ–సెల్లర్లను సీసీఐ హెచ్చరించింది.

మ్యూచువల్ ఫండ్ నిబంధనల్లో రాజీలేదు

- పెట్టుబడిదారులకు నష్టం లేకపోయినా చట్ట ఉల్లంఘన సమర్థనీయం కాదు
- కొటక్ ఏఎంసీ అప్పీల్ తిరస్కరణ
- సెబీ చర్యలకు సుప్రీంకోర్టు మద్దతు

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్‌ల నిర్వహణలో సెక్యూరిటీస్ చట్టాలు, సెబీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పెట్టుబడిదారులకు చివరకు నష్టం జరగకపోయినా లేదా లాభం వచ్చినా నిబంధనల ఉల్లంఘనను సమర్థించలేమని పేర్కొంటూ కొటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (కొటక్ ఏఎంసీ), కొటక్ మహీంద్రా ట్రస్టీ కంపెనీతో పాటు ఆరుగురు సీనియర్ అధికారుల అప్పీలను సోమవారం తిరస్కరించింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీష్ చంద్ర శర్మల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. 2019లో కొటక్ ఏఎంసీ నిర్వహించిన ఆరు ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్ (ఎఫ్ఎంపీ) పథకాల నిర్వహణలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని సెబీ నిర్ధారించగా, సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎస్ఏటీ) ఆ నిర్ణయాన్ని సమర్థించింది. ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా అదే నిర్ణయాన్ని నిలబెట్టింది. ఎస్సెల్ గ్రూప్ సంస్థల డెట్ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టిన కొటక్ ఏఎంసీ, తనఖా షేర్ల విలువ పడిపోవడంతో పథకాల మెచ్యూరిటీ తేదీన పెట్టుబడిదారులకు చెల్లింపులను ఏకపక్షంగా వాయిదా వేసిందని కోర్టు పేర్కొంది. పెట్టుబడిదారుల అనుమతి లేకుండా గడువు పొడిగించడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని కొటక్ ఏఎంసీ వాదించినప్పటికీ, ‘ఫలితం ఎలా ఉన్నా చట్ట ఉల్లంఘనను సమర్థించలేం. అలాంటి వాదనలు మార్కెట్ క్రమశిక్షణకు భంగం కలిగిస్తాయి’ అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ట్రస్టీ సంస్థ కూడా స్వతంత్రంగా నిర్ణయాలను సమీక్షించాల్సిన బాధ్యతను నిర్వర్తించలేదని కోర్టు పేర్కొంది. అదేవిధంగా, ఆర్థికంగా బలహీనంగా ఉన్న ఎస్సెల్ గ్రూప్ సంస్థల్లో రూ.266 కోట్ల పెట్టుబడులు పెట్టే సమయంలో తగిన రిస్క్ అంచనా వేయలేదని కోర్టు అభిప్రాయపడింది. సెబీ విధించిన జరిమానాలను సమర్థించిన సుప్రీంకోర్టు, అదనంగా కొటక్ ఏఎంసీపై రూ.30 లక్షలు, కొటక్ ట్రస్టీ కంపెనీపై రూ.20 లక్షలను వ్యాజ్య వ్యయాలుగా విధిస్తూ రెండు నెలల్లో జమ చేయాలని ఆదేశించింది. ఆ మొత్తాన్ని బలహీన వర్గాల సంక్షేమం కోసం పని చేస్తున్న 10 స్వచ్ఛంద సంస్థలకు సమానంగా పంపిణీ చేయాలని సూచించింది.

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో మళ్లీ పెరిగి భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) నిర్దేశించిన 4 శాతం మధ్యస్థ లక్ష్యాన్ని అధిగమించింది. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మేలో 3.93 శాతంగా ఉండగా, జూన్‌లో 4.38 శాతానికి పెరిగినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) సోమవారం వెల్లడించింది. ఆహార వస్తువుల ధరల పెరుగుదలే ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధాన కారణమైంది. ఆహార ద్రవ్యోల్బణం మేలో 4.78 శాతం ఉండగా, జూన్‌లో 5.32 శాతానికి చేరింది. ముఖ్యంగా బంగారం, వెండి, వజ్రాభరణాలు, అల్లం, టమాటా, కిస్మిస్ ధరలు పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం 4.74 శాతం, పట్టణ ప్రాంతాల్లో 3.92 శాతంగా నమోదైంది. రాష్ట్రాల వారీగా తెలంగాణలో అత్యధికంగా 6.36 శాతం ద్రవ్యోల్బణం నమోదుకాగా, మిజోరాంలో అత్యల్పంగా 1.63 శాతం నమోదైంది. 2025 జనవరి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త సీపీఐ శ్రేణి ప్రకారం ద్రవ్యోల్బణం 4 శాతం మార్కును దాటడం ఇదే తొలిసారి.

గాడ్ ఆఫ్ వార్‌పై త్రివిక్రమ్ ఫోకస్?

ఎన్టీఆర్ హీరోగా స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించనున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'గాడ్ ఆఫ్ వార్'పై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. 'అరవింద సమేత' తర్వాత ఎన్టీఆర్ – త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా సుబ్రహ్మణ్య స్వామి కథాంశంతో రూపొందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో ధనుష్ – వెట్రిమారన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'తమిళ్ మురుగన్' కూడా ఇదే నేపథ్యంతో తెరకెక్కనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో 'తమిళ్ మురుగన్' ముందుగా విడుదలయ్యే అవకాశం ఉండటంతో, త్రివిక్రమ్ తన స్క్రిప్ట్‌లో కొన్ని కీలక మార్పులు చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా సుబ్రహ్మణ్య స్వామి దైవత్వం, పురాణ నేపథ్యం, పాత్ర వైభవాన్ని మరింత ప్రభావవంతంగా చూపించేలా కథను మెరుగుపరుస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన నటీనటులు, సాంకేతిక బృందం వివరాలు త్వరలో అధికారికంగా వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

క్లైమాక్స్‌కు సిద్ధమవుతున్న 'రౌడీ జనార్దన'

విజయ్ దేవరకొండ హీరోగా దర్శకుడు రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్న 'రౌడీ జనార్దన' చిత్రం క్లైమాక్స్ చిత్రీకరణకు సన్నాహాలు జరుగుతున్నాయి. భారీ యాక్షన్ ఎపిసోడ్‌తో రూపొందనున్న ఈ క్లైమాక్స్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్లు నిర్మిస్తున్నట్లు సమాచారం. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ పూర్తి స్థాయి యాక్షన్ అవతార్‌లో కనిపించనున్నారని, ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలే సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ చిత్రంలో సీనియర్ హీరో రాజశేఖర్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పాత్ర, లుక్ ఇప్పటివరకు కనిపించని విధంగా ప్రత్యేకంగా ఉంటాయని సమాచారం. గ్రామీణ నేపథ్యంతో సాగే ఈ సినిమాలో విజయ్ దేవరకొండకు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొనగా, అధికారిక అప్డేట్ల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మూడు రోజుల్లో 'లెనిన్' రూ.12 కోట్ల వసూళ్లు

అఖిల్ హీరోగా తెరకెక్కిన 'లెనిన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రదర్శన కొనసాగిస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే భారీ ఓపెనింగ్స్ నమోదు చేసిన ఈ సినిమా, తర్వాతి రెండు రోజుల్లోనూ మంచి వసూళ్లను సాధించి తొలి వారాంతాన్ని విజయవంతంగా ముగించింది. ముఖ్యంగా నైజాం ప్రాంతంలో ఈ చిత్రానికి విశేష స్పందన లభించింది. తొలి మూడు రోజుల్లోనే అక్కడ సుమారు రూ.12 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆదివారం అత్యధిక వసూళ్లు రావడం సినిమాకు ఉన్న ఆదరణను ప్రతిబింబిస్తోంది. ఇప్పుడు చిత్రానికి అసలైన పరీక్షగా భావించే సోమవారం కలెక్షన్లు కీలకం కానున్నాయి. వారాంతం తర్వాత కూడా ఇదే జోరు కొనసాగితే, బాక్సాఫీస్ వద్ద సినిమా మరింత బలమైన ప్రదర్శన కనబరచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించగా, సునీల్, బ్రహ్మాజీ, శివాజీ, ఈశ్వరీ రావు కీలక పాత్రలు పోషించారు. థమన్ అందించిన సంగీతం సినిమాకు మరో ప్రధాన బలంగా నిలిచి, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటోంది. మొత్తంగా 'లెనిన్'తో అఖిల్ పెట్టుకున్న ఆశలు ఫలిస్తున్నాయనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

నాని సినిమాలో రుక్మిణి వసంత్?

టాలీవుడ్‌లో మరో క్రేజీ కాంబినేషన్ రూపుదిద్దుకుంటున్నట్లు ఫిల్మ్‌నగర్‌లో జోరుగా ప్రచారం సాగుతోంది. స్టార్ హీరో నాని తన నిర్మాణ సంస్థ 'వాల్ పోస్టర్ సినిమా' బ్యానర్‌పై నిర్మించనున్న కొత్త చిత్రంలో యంగ్ హీరో నితిన్ కథానాయకుడిగా నటించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో నితిన్‌కు జోడీగా పాన్ ఇండియా క్రేజ్ సంపాదించుకున్న రుక్మిణి వసంత్‌ను ఎంపిక చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా వెలువడనప్పటికీ, ఇండస్ట్రీ వర్గాల్లో ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. నిర్మాతగా నాని విభిన్న కథలను ప్రోత్సహిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన నిర్మించిన తొలి చిత్రం 'అ'! రెండు జాతీయ అవార్డులు అందుకోగా, హిట్ ఫ్రాంచైజీ క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఇటీవల ప్రియదర్శి ప్రధాన పాత్రలో నిర్మించిన కోర్ట్ చిత్రం కూడా బాక్సాఫీస్ వద్ద రూ.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి నిర్మాతగా నానికి మరో విజయాన్ని అందించింది. ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవితో ఓ భారీ చిత్రాన్ని నిర్మించనున్న నాని, సమాంతరంగా నితిన్‌తో ఈ కొత్త సోషల్ డ్రామాను కూడా పట్టాలెక్కించనున్నట్లు సమాచారం. వరుస పరాజయాల తర్వాత బలమైన కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న నితిన్ ఈ చిత్రంపై భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సప్త సాగరాలు దాటి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన రుక్మిణి వసంత్, కాంతార చాప్టర్–1, ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న డ్రాగన్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇలాంటి సమయంలో ఆమె నితిన్ సరసన నటించనున్నారనే వార్త సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రానికి దండోరా సినిమాతో ప్రశంసలు అందుకున్న యువ దర్శకుడు మురళీకాంత్ దేవాసోత్ దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. సామాజిక అంశాలతో కూడిన బలమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కనుండగా, త్వరలోనే చిత్రబృందం అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

24న రామాయణ ట్రైలర్ విడుదల



భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఇదీ ఒకటి. ఈ మూవీలో రాముడిగా బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వం లో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించింది. జులై 24న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. కొన్ని వేల సంవత్సరాలుగా ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ అనే ఆదర్శాలతో 'రామాయణం' ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చింది. మన నాగరికతకు అద్దం పట్టే ఈ గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచానికి సరికొత్తగా పరిచ యం చేయబోతున్నాం అని ఇన్‌స్టాలో చిత్రబృందం పోస్ట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవితో పాటు పలువురు అగ్ర తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు.

ఊరమాస్‌గా శివకార్తికేయన్

దక్షిణాది సినీ పరిశ్రమలో దైవిక, పురాణ గాథల నేపథ్యానికి నయా క్రేజ్ మొదలైంది. ఒకప్పుడు పౌరాణిక కథలకు రాఫ్ అడ్రస్‌గా కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలు మళ్లీ అదే బాట పట్టినట్లు తెలుస్తున్నాయి. ప్రస్తుతం తమిళ, తెలుగు సినీ రంగాలలో లార్డ్ మురుగన్ (సుబ్రమణ్య స్వామి) కాన్సెప్ట్ ఒకవైపు భారీ ట్రెండ్‌గా మారుతోంది. టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖ దర్శకులు, అగ్ర హీరోలు మురుగన్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రతిష్టాత్మక చిత్రాలను ప్రకటించడం సోషల్ మీడియా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ట్రెండ్‌ను మొదటిగా కోలీవుడ్ హీరో శివకార్తియన్ ప్రారంభించాడు అని చెప్పవచ్చు. శివకార్తికేయన్ పుట్టినరోజు పురస్కరించుకుని విడుదలైన ఒక గ్లింప్స్ ఇటీవలే అందరి దృష్టిని ఆకర్షించింది. శివకార్తికేయన్ ప్రధాన పాత్రలో లోకనాయకుడు కమల్ హాసన్ భారీ నిర్మాణంలో, శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'సేయోన్' అనే చిత్రం ఈ మురుగన్ సెంటిమెంట్‌కు పునాది వేసింది. తమిళ ప్రాచీన సంస్కృతి, సాహిత్యంలో కార్తికేయుడిని 'సేయోన్' అని పిలుస్తారు. ఈ చిత్ర గ్లింప్స్‌లో శివకార్తియన్ విరుమాండి స్వామి పూనకం వచ్చినట్లుగా, అత్యంత ఊరమాస్ లుక్‌లో పల్లెటూరి జాతర నేపథ్యంలో కనిపించి అభిమానులను అలరించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ యాక్షన్ డ్రామాను అక్టోబర్‌లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. జూనియర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రవ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్ – ఇండియా ప్రాజెక్ట్ అనౌన్స్ అయింది. ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ విస్తృతంగా ప్రచారంలో ఉంది. దీంతో ఈ ప్రాజెక్ట్ డా మురుగన్ జీవితంపై రాబోతుండడంతో టాలీవుడ్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ సినిమా ప్రకటన సమయంలో నిర్మాత నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ తీవ్ర వివాదానికి దారితీసింది. మురుగన్ స్వామి 'ఉత్తరాదిన జన్మించాడు.. దక్షిణాదిన పూజించబడుతున్నాడు' అంటూ ఆయన పేర్కొన్న వ్యాఖ్యలపై తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తమిళులు తమ ప్రాచీన దేవుడైన 'తమిళ్ కడవుల్' (తమిళ దేవుడు) మురుగన్‌ను ఉత్తరాది మూలాలతో ముడిపెట్టడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఎన్టీఆర్ సినిమాపై ఈ రకమైన రాజకీయ, ప్రాంతీయ దుమారం రేగుతున్న తరుణంలోనే, ధనుష్, వెట్రిమారన్ కాంబినేషన్‌లో 'తమిళ్ మురుగన్' ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్‌లో ధనుష్ ఒక భారీ ఏనుగుపై గంభీరంగా కూర్చొని, చేతిలో మురుగన్ స్వామి యొక్క శక్తివంతమైన ఆయుధం 'వేల్' (ఈటె) పట్టుకుని, ఒక భారీ సైన్యం ముందు తమిళ ప్రజలకు, ఆ నేల రక్షకుడిగా కనిపించారు. అయితే ఒకప్పుడు భక్తిరస చిత్రాలుగా వచ్చిన దేవుళ్ల కథలు, ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో భారీ బ్జడెట్ యాక్షన్ డ్రామాలుగా, అలాగే ప్రాంతీయ అస్తిత్వానికి ప్రతీకలుగా మారుతున్నాయి.

నా కెరీర్‌లో ప్రత్యేకమైన సినిమా

'శ్రీనివాస మంగాపురం'

సూపర్‌స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా, అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కిన 'శ్రీనివాస మంగాపురం' చిత్రం జూలై 30న విడుదల కానుంది. ఈ సినిమాతో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని తెలుగు తెరకు హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడారు. గత ఏడాది అజయ్ భూపతి కథ చెప్పగానే అందులోని ప్రేమ, భావోద్వేగాలు తనను ఆకట్టుకున్నాయని రాషా తెలిపారు. ఈ చిత్రంలో 'మంగా' పాత్రలో రెండు భిన్నమైన షేడ్స్‌లో కనిపిస్తానని, దర్శకుడు ప్రతి డైలాగ్, ప్రతి ఎమోషన్‌ను ఎంతో ఓర్పుతో నేర్పించారని చెప్పారు. హీరో జయకృష్ణ చాలా కూల్, స్వీట్ పర్సన్ అని, ఆయనతో కలిసి పనిచేయడం సరదాగా అనిపించిందన్నారు.

మోహన్‌బాబుతో నటించడం గొప్ప అనుభవమని, ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నానని తెలిపారు. వైజయంతి మూవీస్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ ద్వారా తెలుగు చిత్రసీమలోకి రావడం ఆనందంగా ఉందని, నిర్మాత అశ్విని దత్ తనను మనవరాలిలా చూసుకున్నారని చెప్పారు. తెలుగు ఇండస్ట్రీలో మంచి వాతావరణం ఉంటుందని తన తల్లి చెప్పారని, ప్రస్తుతం తెలుగు నేర్చుకుంటున్నానని వెల్లడించారు. తిరుపతిలో తన తొలి తెలుగు సినిమా షూటింగ్ జరగడం అదృష్టంగా భావిస్తున్నానని, ప్రేక్షకుల ఆశీస్సులతో ఈ చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నానని రాషా తడాని తెలిపారు.

బాలయ్యకు అన్నయ్యగా సంజయ్ దత్?

నందమూరి బాలకృష్ణ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించనున్న కొత్త సినిమా గురించి ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటుడు సంజయ్ దత్ కీలక పాత్రలో నటించనున్నట్లు ఫిల్మ్ నగర్‌లో ప్రచారం జరుగుతోంది. బాలయ్యకు అన్నయ్య పాత్రలో ఆయన కనిపిస్తారని, అయితే ఆ పాత్ర కేవలం ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌కే పరిమితమవుతుందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు కొరటాల శివ రూపొందించిన ప్రతి చిత్రంలో బలమైన కథా నేపథ్యం, ప్రాంతీయ సంస్కృతి, భావోద్వే గాలకు పెద్దపీట వేశారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన విభిన్న కథను సిద్ధం చేసినట్లు సమాచారం. దేవర తర్వాత కొరటాల శివ ఎంతో కసరత్తు చేసి ఈ కథను రూపొందించినట్లు సినీ వర్గాలు చెబుతు న్నాయి. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

'జార్జ్ క్రిష్'లో రవీనా టాండన్?

దర్శకుడు శ్రీను వైట్ల, హీరో శర్వానంద్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'జార్జ్ క్రిష్' సినిమాపై ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కీలక పాత్రలో నటించనున్నట్లు ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది. కథలో అత్యంత ప్రాధాన్యమున్న పోలీస్ అధికారి పాత్ర కోసం ఆమెను ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఈ సినిమా తొలి షెడ్యూల్‌కు చిత్రబృందం సిద్ధమవుతుండగా, రెండో షెడ్యూల్‌ను ఆగస్టు రెండో వారంలో ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సేను ఎంపిక చేసినప్పటికీ, దీనిపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. తొలి షెడ్యూల్‌లో హీరో – హీరోయిన్ల మధ్య సాగే ప్రేమకథకు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు సమాచారం. సంక్రాంతి కానుకగా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో చిత్రబృందం వేగంగా పనులు కొనసాగిస్తోంది. గోపీచంద్‌తో తెరకెక్కించిన 'విశ్వం' చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో, ఈసారి శర్వానంద్‌తో చేస్తున్న 'జార్జ్ క్రిష్' ద్వారా బలమైన కమ్‌బ్యాక్ ఇవ్వాలని దర్శకుడు శ్రీను వైట్ల కసరత్తు చేస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

17న ప్రేక్షకుల ముందుకు 'ఓ సుకుమారి'

'మసూద', 'పరేషాన్' చిత్రాలతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్, టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ మ్యూజికల్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ, ఆ తర్వాత వారి జీవితాల్లో వచ్చే మలుపుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తిరువీర్ తన మార్క్ సహజ నటనతో ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ మరోసారి నటన ప్రాధాన్యమున్న పాత్రలో మెరిశారు. భరత్ మంచిరాజు అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సున్నితమైన భావోద్వేగాలు, చక్కటి వినోదంతో డిన ఈ చిత్రం జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi.** **RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277